
మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


# పాడి పరిశ్రమ ద్వారా రైతులకు నిరంతర ఆదాయం

**■ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య చైర్మన్ సోమ భరత్‌కుమార్**

**గండీడ్, జూన్ 28 ప్రభాతవార్త:** పాడిపరిశ్రమ ద్వారా పాడి రైతులకు నిరంతరం ఆదాయం వస్తుందని రాష్ట్ర పాడి పరిశ్రమాబివృద్ధి సమాఖ్య చైర్మన్ సోమ భరత్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, విజయ డైరీ ఎండి అదేర్ సిన్హా, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రవినాయక్, పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహే శ్వర్‌రెడ్డితో కలసి గండీడ్ మండల కేంద్రంలో రూ. 2 కోట్ల 80 లక్షల రూర్బన్ నిధులతో నిర్మించిన విజయ డైరీ పాల శీతలీకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సోమభరత్‌కుమార్ మాట్లాడుతూ గడిచిన తొమ్మిది సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రం అనేక రంగాలలో అభివృద్ధి సాధించిందని, పాలు, పాల ఉత్పత్తుల ద్వారా నిరంతరంగా ఆదాయం పొందే అవకాశం పాడి రైతులకు ఉందని ఈ విషయాన్ని పాడి రైతులు గమనించాలని కోరారు. మహారాష్ట్ర లోని ఒక్కో గ్రామంలో సుమారు 10 వేల లీటర్ల పాలను పాడి రైతులు ప్రతిరోజు విక్రయిస్తున్నారని, వ్యవసాయానికి అదనంగా పాడిపరిశ్రమ వస్తే బాగుంటుందని, పెట్టుబడి కింద పాడి గేదెలు, ఆవులు కొనుక్కునేందుకు ముద్రరుణాల ద్వారా రునం పొందవచ్చని బ్యాంకు రుణం చెల్లించడంతోపాటు, మిగిలిన డబ్బులతో సేద్యం, సేంద్రీయ ఎరువులు, ఉత్పత్తి వంటి వాటిని చేపట్టవచ్చని అన్నారు. గండీడ్ ప్రాంతంలో 1000 మంది పాడి రైతులకు ముద్ర రుణాలిచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. పాడి పశువుల వల్ల ఎలాంటి నష్టం లేదని ముఖ్యంగా పాడి రైతులు ప్రత్యేక దృష్టి పెడితే అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. 2014కు ముందు నీరు సరిగా ఉండేది కాదని, విద్యుత్ సరిగా ఉండేది కాదని, అలాంటిది తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత నాలుగు నెలల్లోనే 9 గంటల నిరంత విద్యుత్ ఇవ్వడం జరిగిందని, అనంతరం 24 గంటలు విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని, తెలంగాణ వచ్చిన తర్వాత పల్లెలకు పూర్వ వైభవం వచ్చిందని, ముఖ్యంగా రైతులు బాగుపడడానికి పాడి పరిశ్రమ ఎంతో సహకరిస్తుందని, ఈ అవకాశాన్ని రైతు లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయ డైరీ అదేర్ సిన్హా మాట్లా డుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్‌జిల్లాలో మహబూబ్‌నగర్, జడ్చర్ల, వనపర్తి, పెద్దదిరాళ్లతో పాటు, గండీడ్‌లో విజయడైరీ పాలశీతలీకరణకేంద్రాలు ఏర్పాటుచేయడం జరిగిందని, మహబూబ్ నగర్ జిల్లాలో 9 సంవత్సరాలకు పూర్వం వలసలు వెళ్లే పరిస్థితి ఎక్కువగా ఉండేదని, ఇప్పుడు సాగునీటితో పాటు, పాడి పరిశ్రమ అభివృద్ధి చెందడం వల్ల వలసలు ఆగిపోయాయని అన్నారు. విజయ పాలశీతలీకరణ కేంద్రాలను ప్రతి మండలంలో విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, విజయ పాల వల్ల పాలకు ధర ఎక్కువగా ఇవ్వడమే కాకుండా, పాల ఉత్పత్తుల వల్ల లాభాలు సాధించవచ్చని అన్నారు. జిల్లా కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సైతం పట్టణ ప్రాంత సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో రూర్బన్ కింద గండీడ్ మండలంలో 30 కోట్ల రూపాయలతో వివిధ రకాల పనులు చేపట్టడం జరిగింది, అందులో భాగంగానే రెండు కోట్ల 80 లక్షల రూపాయలతోపాలశీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించుకున్నట్లు తెలిపారు. పాడి రైతులకు ఇది మంచి అవకాశం అని, ఈ పాల శీతలీకరణ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని, పాలు అమ్మిన రైతులకు 15 రోజుల్లో డబ్బులు వారి అకౌంట్లో జమవుతాయని, వ్యవసాయం ద్వారాసీజన్‌లో మాత్రమే డబ్బులు వస్తే, పాడిపరిశ్రమ ద్వారా నిరంతరం ఆదాయం వస్తుందని, జిల్లాలో భూగర్భ జలాలు పెరగడం వల్ల పాల ఉత్పత్తి పెరిగి ఆదాయం వచ్చేందుకు అవకాశం ఉందని అన్నారు. ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గండీడ్‌లో ఏర్పాటు చేసిన పాలశీతలీకరణ కేంద్రంవల్ల సుమారు పదివేల లీటర్ల పాలను సేకరించవచ్చని, దీని ద్వారా ఐదు నుండ 6 వేల మంది రైతులు ఉపయోగపడతారని, మూడు నియోజకవర్గాలలోని నాలుగు మండలాలకు సంబంధించి 80 గ్రామాల పాడి రైతులు లాభం పొందుతారని తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యంగా విజయ పాలశీతలీకరణ కేంద్రంవల్ల నిరంతరం రైతులకు ఆదాయం రావడమే కాకుండా, ఎలాంటి కల్తీలేని పాల ఉత్పత్తులు దొరుకుతాయని, అంతేకాక పాడి రైతులు ప్రభుత్వం ద్వారా అందే ఇతర సబ్సిడీలను అందుకోవచ్చని, ముద్రరుణాలతోపాటు, ఇతరసౌకర్యాలు పొందవచ్చని అన్నారు. పాలశీతలీకరణ కేంద్రం సందర్భంగా భూములు కోల్పోయిన నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించి ఇవ్వడమే కాకుండా, దళిత బంధు కిందవారికిఆర్థిక సహకారం అందజేస్తామని ఆయన తెలిపారు. జడ్పీటిసి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిపిమాధవి, సర్పంచ్ చంద్రకళ, జిల్లాడిఆర్‌డిఏ యాదయ్య, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి మధుసూదన్, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖడిడికవిత మాట్లాడారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్


పాలశీతలీకరణ కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

## ఈదుల్ అజహాకు ముస్తాబైన ఈద్గా



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 28 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో గల ఈద్గా వద్దబక్రీద్ సందర్భంగా ఈదుల్ అజహ ప్రత్యేక నమాజ్ కోసం ఏర్పాట్లు చురుకుగా కొనసాగుతున్నాయి. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటి ఆధ్వర్యంలో అధికారులు ఈద్గాకు పెయింటింగ్‌తో పాటు వర్షంతో నేల తడిచి ఉండటంతో స్టోన్ చిప్స్, డస్ట్ పరిచి నమాజ్ చదవడానికి అనువుగా చదును చేశారు. దీంతో పాటు ఈదుల్ అజహ ప్రత్యేక నమాజ్ కోసం ముస్లిం సోదరులకు ఇబ్బందులు కలుగకుండా పెండల్స్, షామియానాలను ఏర్పాటు చేస్తున్నారు. ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ కల్పన భాస్కర్, మున్సిపల్ కమిషనర్ జయంత్ కుమార్‌రెడ్డి, వక్ఫ్ కాంప్లెక్స్ భవన నిర్మాణ కమిటీ సభ్యులు, ముస్లిం ప్రజా ప్రతినిధులతో కలిసి పర్య వేక్షించారు. ఈద్గా వద్ద గురువారం ఉదయం 9 గంటలకు ప్రత్యేక నమాజ్ ఈదుల్ అజహ ఉంటుందని జామే మస్జీద్ ఇమామ్‌అబ్దుల్ హక్ తెలిపారు. నిర్ణిత సమయానికి ఈదుల్ అజహ నమాజ్ ఉంటుందని, సమయానికి ఈద్గాకు చేరుకోవాలని ఆయన కోరారు. వర్షం వస్తే జిల్లా కేంద్రంలోని మస్జీద్‌లలో నమాజ్ కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఉపాధి హామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ అవకతవకలు?


ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు, హాజరు పత్రంలో పెన్నుతో, హాజరైన స్థానంలో పనికి రానట్లుగా రాశారని చూపిస్తున్న కూలీలు



**వీపనగండ్ల, జూన్28, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు వారం రోజులు పని చేస్తే రెండు రోజులు, లేదా మూడు రోజులు లేదా ఒక రోజు హాజరు వేస్తున్నారని ఉపాధి హామీ కూలీలు అంటున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై గ్రామంలోని గ్రామ పంచాయతీ దగ్గర ఉండే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం బాక్సులో కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్ చేసిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని ఈజీఎస్ అంబుడ్స్ పర్సన్ పేరు మీద ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ... గత వారం ఉపాధి పథకంలో పని చేసిన కూలీలకు ఫీల్డ్ అసిస్టెంట్ బాలకృష్ణ ఆరు రోజులు పని చేస్తే రెండు రోజులు ,ఒక రోజు, నాలుగు రోజులు పని చేసినట్లు మాత్రమే నమోదు చేయడం జరిగిందని, నమోదు చేసిన కూలీ రోజులకే పే స్లిప్పులు ఇవ్వడం జరిగిందన్నారు. బుధవారం గ్రామ సమీపంలో కూలీ పని చేస్తున్న పని దగ్గరికి ఫీల్డ్ అసిస్టెంట్ బాలకృష్ణ రావడంతో గత వారం పని చేసిన పని దినాలను ఎందుకు తగ్గించి రాశావని కూలీలు నిలదీయడం జరిగింది. ఫీల్డ్ అసిస్టెంట్ బాలకృష్ణను కూలీలు అసభ్య పదజాలంతో దూషించారు. ఉపాధి హామీ కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్‌ను నిలదీయగా మీరు ఎవరికైనా ఫిర్యాదు చేసుకోండి. నేను ఏ అధికారికి భయపడను. ఏమైనా చేసుకోండి అని నిర్లక్ష్యంగా మాట్లాడడం జరిగిందని కూలీలు ఆరోపించారు. కూలీలు పని చేసిన పని దినాలను తగ్గించడమే కాకుండానిర్లక్ష్యంగా మహిళాకూలీలను దూషించిన ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తు రాతపూర్వకంగా ఫిర్యాదు రాసి గ్రామ పంచాయతీలో ఉన్న ఫిర్యాదు పెట్టెలో వేయడం జరిగింది. గురువారం జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు కూలీలు తెలిపారు. మస్టర్‌లో ఉన్న హాజరును మార్చివేసి పని దినాలు తగ్గించడం జరిగిందని కూలీలు తెలిపారు. ఈ విషయంపై మండల అధికారులను కలుస్తామని , వారి నుండి న్యాయం జరగకపోతే జిల్లా అధికారులను కలిసి మాకు న్యాయం చేసే వరకు పోరాడుతామని వారు తెలిపారు.

## బాల బాలికల జీవితాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది

**-నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 28 ప్రభాతవార్త:** బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టోరేట్‌లో 9వ విడత ఆపరేషన్ ముస్కాన్‌పై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు పిల్లలు ఎవరైన ప్రమాదకర ప్రదేశాల్లో పనిచేస్తున్నట్లు అయితే వారిని గుర్తించి రక్షించాలన్నారు. పనిచేయిస్తున్న యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చిన్న పిల్లల్ని ఎవరైన వెట్టి చాకిరికి గురి చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జూలై 1వ తేదీ నుంచి జూలై 31వ తేదీ వరకు నిర్వహించే 9వ విడత ఆపరేషన్ ముస్కాన్‌లో పోలీసుల బృందం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, కార్మిక శాఖ, సచ సెంటర్, విద్యాశాఖ, వివిధ శాఖలు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి బాలల సంరక్షణ కోసం చర్యలు తీసుకుంటాయన్నారు. సిబ్బందితో పాటు ప్రజలు సహకరించాలన్నార. బాల కార్మికులు కిరాణం షాపులో, మెకానిక్ షాపులలో, హోటళ్లలో పనిచేస్తూ, రోడ్లపై వదిలేయబడిన పిల్లలు, భిక్షాటన చేస్తున్న పిల్లలు ఉన్నట్లు అయితే గుర్తిస్తారని తెలిపారు. అలాంటి వారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగించడం లేదా స్టేట్ హోమ్స్‌కు పంపించడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. అధికారులు వారం రోజులకొకసారి తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా చేపట్టిన 212 కేసుల్లో ఎంత మందిని ఏ ఏ వసతి గృహాలకు పంపించారోమొత్తం రిపోర్టును తమదృష్టికి తీసుకొని రావాలని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా 1098 చైల్డ్ ప్రొటెక్షన్ నెంబకు వచ్చిన కాల్స్ వివరాలను అందజేయాలని ఆదేశించారు. జిల్లాలో బాల కార్మిక నిర్మూలన వ్యవస్థకు అధికారులు సమన్వయంతో పనిచేసి విద్యార్థులకు బంగారు జీవితాన్ని అందించేలా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపుఎస్పీ రామేశ్వర్, జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి వెంకటలక్ష్మి, చైల్డ్ ప్రొటెక్షన్ చైర్మన్ లక్ష్మణరావు, బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీధర్, జిల్లా ఇమినైజేషన్ అధికారి రవినాయక్, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి నిరంజన్, ఎన్జీవోలు రామకృష్ణ, అనాధ ఆశ్రమం నిర్వాహకులు, అధికారులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

## కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ బడులు

◆ ట్యాంక్ బండ్ వద్ద మినీ వండర్ లా ఏర్పాటు
◆ హన్వాడ పాఠశాలను చూసి ఆశ్చర్యపోయిన ఢిల్లీ అధికార బృందం
◆ రాష్ట్ర పర్యాటక, ఆబ్కారి శాఖమంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరోజూన్ 28 ప్రభాతవార్త:** సీఎం కెసిఆర్ ఆధ్వర్యంలో తెలంగాణలోని ప్రభుత్వ బడుల రూపురేఖలు మారిపోతున్నాయని కార్పొరేట్ స్కూళ్లను తలపిస్తున్నాయని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. హన్వాడలో మన ఊరు మనబడి పథకం ద్వారా అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాలను చూసి అచ్చం కార్పొరేట్ పాఠశాలలా ఉందంటూ ఢిల్లీ నుంచి అధ్యయనం కోసం వచ్చిన కేంద్ర బృందం ఆశ్చర్యపోయిందని మంత్రి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని షాషాబ్‌గుట్ట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మంత్రి ప్రసంగించారు. షాషాబ్‌గుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం మన ఊరు మనబడి పథకం కింద రూ. 50 లక్షలు మంజూరు చేశామని వచ్చే ఏడాదిలోగా ఈ పాఠశాల సైతం సర్వాంగ సుందరంగా తయారవుతుందని తెలిపారు. విద్యార్థుల సంఖ్య పెరిగిందని పక్కనే ఉన్న బీడీ కళాశాలలో నిరుపయోగంగా ఉన్న గదులను తమకు కేటాయించాలని పాఠశాల ఉపాధ్యాయులు కోరగా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి విద్యార్థులకు అసౌకర్యం లేకుండా చూడాలని ఆదేశించారు. మహబూబ్‌నగర్‌లో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామన్నారు. స్థానికంగా ట్యాంక్ బండ్ వద్ద హైదరాబాద్ వండర్‌లా మాదిరిగా మిని వండర్‌లా ఏర్పాటు చేస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. లండన్ ఐ తరహాలో అతిపెద్ద జాయింట్ వీల్ ఎంతో ఆకట్టుకుంటుందని అన్నారు. సస్పెన్షన్ బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యాయి. నెలరోజుల్లో పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో భారత సేవాశ్రమ సంఘం అధ్యక్షుడు మునీశ్వరనంద స్వామీజీ, మున్సిపల్ ఛైర్మన్ కెసి నర్సింహులు, రెడ్‌క్రాస్ ఛైర్మన్ నటరాజ్, కౌన్సిలర్లు కట్టరవి, కిషన్‌రెడ్డి, తిరుమల, రోజా, వెంకటేష్, పాపారాయుడు, తహసిల్దార్ పార్థసారథి, ప్రధానోపాధ్యాయుడు సాయిబాబా ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## పోడు భూముల పట్టాలు ఒక మాయ

**- పోడు భూములకు పట్టాలు అందించాలి : డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**

**అచ్చంపేట, జూన్ 28 ప్రభాతవార్త:** నల్లమల్ల ప్రాంతంలో సాగు చేస్తూ జీవనం గడుపుతున్న గిరిజన, గిరిజనేతర ప్రజలకు రెవెన్యూ అధికారులచే కాకుండా ఫారెస్ట్ అధికారులచేత ట్రైబల్ వెల్ఫేర్ అధికారుల చేత ఇవ్వడం మరోసారి పోడు భూముల రైతులను మోసం చేయడమేనని డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆరోపించారు. అచ్చంపేట పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్ల కోసమే పోడు భూముల పట్టాలు ఇప్పిస్తామని డ్రామా ఆడుతున్నారే తప్ప మరోకటి కాదని, పోడు భూముల పట్టాలు ఒక మాయ అని, ఎన్నికల ముందుఓట్ల కోసమే ఈ పోడు భూముల పట్టాల పంపిణీని ఆశ చూపుతున్నారని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పోడు భూముల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో ఎందుకు పరిష్కరించలేదని ఆయన ప్రశ్నించారు. మరోసారి గిరిజనులను మోసం చేసేందుకు పోడు భూముల పట్టాలు ఇప్పిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారే తప్ప అందించడానికి ఎందుకు వెనుకాడుతున్నారని ఆయన ప్రశ్నించారు. తూతూ మంత్రంగా రైతుబంధు కోసం పట్టాల పంపిణీ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రైతులకు భూమి హక్కు పత్రాలు కావాలని, తాత్కాలిక పత్రాలను అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పోడు భూముల పట్టాలతో భూమి క్రయ విక్రయాలు, బ్యాంకుల్లో లోన్లు, రుణాలు ఎటువంటి వాటికి చట్ట ప్రకారం చల్లవని, ఎన్నికల ముందు రైతు బంధు కోసమే ఈ పట్టాల పంపిణీ చేపడుతున్నారని, ఫారెస్ట్ అధికారులు యదావిధిగా భూములను సాగుచేయనివ్వకుండా భూములను లాక్కొంటారని ఆయన తెలిపారు. మాచారం గ్రామంలో గతంలో ఇద్దరు చెంచు రైతులు చనిపోయిన విషయం తెలిసిందేనని, ల్యాండ్ సిలింగ్ యాక్ట్ ప్రకారం ఇందిరమ్మ రాజ్యాంలో 12లక్షల ఎకరాల భూమిని గిరిజనులకు అందించడం జరిగిందని ఆయన తెలిపారు. పట్టాలు బీఆర్ఎస్ నాయకులకు ఎక్కువ శాతం అందించారని ఆయన ఆరోపించారు. లింగాల మండలం రాయరాం గ్రామంలో సర్వే నెం.83లో 1390 ఎకరాలు ఉందని, అక్కడ 40 మంది రైతులు సాగు చేస్తున్నారని, 600 మందికి పట్టాలు ఇవ్వబోతున్నారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంగాపురం రాజేందర్, అమ్రాబాద్ ఎంపీపీ శ్రీనివాసులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, మాజీఎంపీపీ రామనాథం, కౌన్సిలర్ గౌరి శంకర్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు సాయి, మండల పార్టీ అధ్యక్షులు నరసయ్యాయాదవ్, పట్టణ అధ్యక్షులురాఘురాం, హరిశ్చంద్ర, శేఖర్, బుచ్చి రాములు, భరతయ్య, రాఘవులు, సోహేల్, యాదయ్య, భరత్‌కుమార్, ముత్యాలు తదితరులు ఉన్నారు.

వంగూరు మండలం ఉల్పర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కృష్ణ స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు వ్యవహార శైలి నచ్చకపోవడంతో పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన కృష్ణకు పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించ్చారు. అదే విధంగా అచ్చంపేట పట్టణంలోని మహేంద్రనగర్ కాలనీలో చెన్నయ్య అనే వ్యక్తి మృతి చెందిన విషయం తెలుసుకున్న వంశీకృష్ణ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు.

**మాజీ ప్రధాని పీవీ నర్సింహ్మారావుకు ఘన నివాళులు:** భారత మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహ్మారావు జయంతి సందర్భంగా అచ్చంపేట పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశంలో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి మార్గదర్శకులుగా నిలిచారని, దేశంలో ఉన్నటువంటి రాజకీయాల్లో ఉన్న వ్యక్తులకు పీవీ నర్సింహ్మారావు ఒక స్ఫూర్తి దాయకమని ఆయన అన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

## ఆధునిక సాంకేతికతను ఉపయోగించి పట్టణ ప్రజలకు సేవలు అందించాలి

**- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**

**వనపర్తి, జూన్28, ప్రభాతవార్త:** ఆధునిక సాంకేతికతను ఉపయోగించి వనపర్తి పట్టణ ప్రజలకు సత్వర సేవలను అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గతంలో జిల్లాల ఏర్పాటు సమయంలో మున్సిపల్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ కార్యాలయానికి కేటాయించారు. ఇటీవల నూతన ఎస్పీ కార్యాలయాన్ని ఐడీవోసి దగ్గర నిర్మించడంతో ఇక్కడ ఉన్న ఎస్పీ కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చారు. ప్రస్తుతం ఈ భవనం ఖాళీగా ఉండడంతో బుధవారం తిరిగి మున్సిపల్ కార్యాలయం పాత భవనంలోకి మారింది. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మున్సిపల్ కార్యాలయాన్ని పున ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛాంబర్‌లో చైర్మన్ గట్టు యాదవ్, కౌన్సిలర్ల బృందాన్ని మంత్రి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి కౌన్సిలర్లు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

## ఎన్నికల సామాగ్రి పరిశీలన


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 28 ప్రభాతవార్త :** బుధవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో ఎఫ్ఎల్‌సి రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఎన్నికల సామాగ్రి పరిశీలనకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 29 నుండి వచ్చేనెల 7 వరకు జరిగే ఎన్నికల సామాగ్రి 3000 ఈవిఎంలు, బియు, సియు, వివి ప్యాట్స్ పరిశీలన ఇంజనీరింగ్ అధికారుల సమక్షంలో పాల్గొనే రాజకీయ పార్టీల ప్రతినిధులకు ధృవీకరణ పత్రం వారి ఐడికార్డు పరిశీలించి లోపలికి పంపాలన్నారు. స్టాఫ్‌కు ఐడి కార్డులు ఇవ్వాలన్నారు. అలాగే సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి దానిని విడియో కవరేజ్ చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, ఏఓ నర్సింగ్‌రావు, ఏఎస్పీ నాగేంద్రుడు, తహసిల్దార్, టిఆర్ఎస్, బిజెపిపార్టీల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## ప్రతి ప్రభుత్వ ఉద్యోగి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోము

**- వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**


విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, జూన్28, ప్రభాతవార్త:** ప్రభుత్వ వేతనం పొందుతున్న ప్రతి ఉద్యోగి తన విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. బుధవారం ఉదయాన్నే వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి, కొత్తకోట మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్యక్రమాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జిల్లా పరిషత్ హై స్కూల్ బాలుర, బాలికల పాఠశాలను సందర్శించి ఉదయాన్నే ప్రార్థనలో పాల్గొని అందరినీ ఆశ్చర్యచకితులను చేశారు. పాఠశాలలో ప్రార్థనలో పాల్గొన్న అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. అందరికీ ఏకరూప దుస్తులు వచ్చాయా, పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్‌లు, నోటు పుస్తకాలు అందాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అన్ని వచ్చాయని విద్యార్థులు తెలిపారు. శ్రద్ధతో బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. బోర్డుపై రాసి విద్యార్థులసామర్థ్యాలను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకుపుస్తకాలు బహుకరించారు. అంతకు ముందు కలెక్టర్ వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయి. ఆసుపత్రిలో ఉన్న పరిశుభ్రత , రోగులకు ఉదయాన్నే ఇచ్చే పాలు, బ్రెడ్ నాణ్యతను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సిబ్బంది ఆప్యాయతతో పలకరించి వారికిఅవసరమైన వైద్యం అందించాలని వైద్యులనుసూచించారు. ఆసుపత్రిపరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. కొత్తకోటలో మున్సిపల్ వార్డులలో తిరుగుతూ పారిశుద్ధ్యంను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, ఇతర సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. పారిశుద్ధ్య పనులు ఆశించిన స్థాయిలో జరగలేదని, ప్రతి వార్డుకు సిబ్బందిని కేటాయించి బాధ్యతలు అప్పటించాలని సూచించారు. మరోమారు వచ్చినప్పుడు వార్డులు అన్ని పరిశుభ్రంగా కనిపించాలని హెచ్చరించారు. ప్రభుత్వ వేతనం పొందుతున్న ప్రతి ఉద్యోగి తన విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండి ప్రజలకు సేవ చేయాలన్నారు. అప్పుడే జిల్లా అభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. కొత్తకోట మున్సిపల్ కమిషనర్ ఇతర అధికారులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.



# నేరాల నిర్మూలన,శాంతిభద్రతల పరిరక్షణకే కమ్యూనిటీ కాంటాక్టు తనిఖీలు

## - డీఎస్పీ ఆనంద్‌రెడ్డి



కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

**వనపర్తి క్రైమ్, జూన్28, ప్రభాతవార్త:** నేరాల నిర్మూలనకై, శాంతిభద్రతల పరిరక్షణ కొరకే కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రామ్‌లో తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని డీఎస్పీ ఆనంద్‌రెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి ఆదేశానుసారం వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇందిరా నగర్ కాలనీలో వనపర్తి డీఎస్పీ ఆనంద్‌రెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి సీఐ మహేశ్వర్, ఎస్ఐలు 08 మంది, ఏఎస్ఐ/ హెచ్‌సీ ఎస్ 11, 39, పీసీఎస్ మొత్తం 60 మంది పోలీసు అధికారులతో ఆకస్మికంగా కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రామ్‌లో భాగంగాబుధవారం తనిఖీలు నిర్వహించారు. కాలనీవాసులకు రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, దొంగతనం ఫోన్ల రికవరీ మొదలైన వాటి గురించి అవగాహన నిర్వహించారు. నంబర్ ప్లేట్ సరిగా లేని ద్విచక్ర వాహనాలు, పత్రాలు సరిగా లేని 39 ద్విచక్ర వాహనాలు, 02 ఆటోలు అదుపులోకి తీసుకుని వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. సంబంధిత వాహనాల యజమానులు తమ వాహనాల పత్రాలను చూపించి వాహనాలను తీసుకువెళ్లాలని అన్నారు. నేరాల నిర్మూలన కొరకే కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రామ నిర్వహించడం జరుగుతుందని, ప్రజల రక్షణ, ప్రజలకు భద్రత భావం, కల్పించడం గురించి, ఎవరైనా కొత్త వ్యక్తులు గాని నేరస్తులు గాని వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందని ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ అందరూ కలిగి ఉండాలని అన్నారు. వాహనాల సంబంధించిన ధృవపత్రాలు రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగానే కమ్యూనిటీ కాంటాక్టు పోలీసింగ్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, దీనికి ప్రజలు సహకరించాలని కోరారు.

కాలనీలలో మరింత స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలను అమర్చుకోవాలని ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని, భద్రతా పరమైన అంశాలలో సీసీ కెమెరాలు కీలకపాత్ర వహిస్తాయని తెలిపారు.తనిఖీలు నిర్వహించడం వలన నేరాల రేటు తగ్గుతాయని ప్రజలకు మరింత రక్షణ కల్పించవచ్చని తెలిపారు.

# అభాగ్యులకు అండ సీఎం రిలీఫ్ ఫండ్

## -కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, జూన్ 28 ప్రభాతవార్త:** బడుగు, బలహీన వర్గాల ప్రజలు అనారోగ్యంతో, ప్రమాదవశాత్తు ప్రమాదానికి గురై వైద్యం చేయించుకోలేని నిస్సాహాయ స్థితిలో ఉండి ప్రాణాలు కోల్పోతున్న వారిని బ్రతికించాలనే ఆలోచనలతో రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సీఎం రిలీఫ్ ఫండ్ పథకాన్ని ప్రవేశ పెట్టి అభాగ్యులకు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో సీఎంరిలీఫ్ ఫండ్‌చెక్కులను బాధితలబ్ధిదారులకు అందించారు. గానుగట్టు తాండకు చెందిన శివకు రూ.10వేలు, వెంకటమ్మకు రూ.34,500, మర్రిపల్లి అండాలు రూ.20వేల చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు తదితరులు ఉన్నారు.

# బక్రీద్ పండుగకు ఏర్పాట్ల పరిశీలన



ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

**కల్వకుర్తి, జూన్ 28 ప్రభాతవార్త:** దైవ ప్రవక్త మొహమ్మద్ ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ నిర్వహించుకునే బక్రీద్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం నిర్వహించే కార్యక్రమానికి కల్వకుర్తి పట్టణంలోని ఈద్గా వద్ద ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహేద్, మున్సిపల్ కమిషనర్ ఆశిత్‌కుమార్‌లతో పాటు ఆయా మస్జిద్ కమిటీల అధ్యక్షులు, సభ్యులతో కలిసి పరిశీలించారు. వర్షం వచ్చే పరిస్థితులు ఉన్నందున ఈద్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎడ్మ సత్యం మాట్లాడుతూ ఈ మాసం ప్రారంభంతోనే ముస్లిం ప్రజలు భక్తి శ్రద్ధలతో హజ్ తీర్థ యాత్రకు బయలుదేరుతారని,హజ్ యాత్రలకు వెళ్లేసోదరులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. కులమతాలకతీకతంగా ప్రతి ఒక్కరు బక్రీద్ వేడుకలను నిర్వహించుకోవాలన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ శివకృష్ణ, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**వంగూరు, జూన్ 28 ప్రభాతవార్త:** వంగూరు మండలం ఉమ్మాపూర్ గ్రామానికి చెందిన అంకూరి లింగయ్య కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లయ్య ఆదేశాల మేరకు ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అందించారు. కార్యక్రమంలో భగవంతు, వెంకటయ్య, శ్రీశైలం, మౌలాన, బాలస్వామి, గణేష్, రమేష్, వెంక టయ్య, బాలస్వామి తదితరులు ఉన్నారు.

# ఉచిత వైద్య శిబిరం విజయవంతం



రోగులకు ఉచితంగా మందులను అందజేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, జూన్ 28 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ కుమారుడు డాక్టర్ ఉప్పల అచల్ ఆధ్వర్యంలో కామినేని డాక్టర్ల సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ ప్రారంభించారు. వైద్య శిబిరంలో 328 మందికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందించారు. అదే విధంగా ఉప్పల వెంకటేష్ గ్రామంలో పర్యటించి గుడిసెల్లో నివసిస్తున్న పది మంది పేదలకు పక్కా ఇండ్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో తలకొండపల్లి ఎంపీపీ నిర్మల శ్రీశైలం, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి,సర్పంచ్‌లసంఘం అధ్యక్షులు గోపాల్‌నాయక్, మార్చాల గ్రామసర్పంచ్ సునితవెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ సంతోష మల్లేష్, మదన్ మోహన్‌రావు,సురేష్,రాములు,మల్లేష్, ప్రక్రుద్దిన్, రామకృష్ణ ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాలను పటిష్టం చేద్దాం

## - జిల్లా విద్యాధికారి గోవిందరాజులు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో గోవిందరాజులు

**వనపర్తి విద్యా విభాగం,జూన్28,ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని కృష్ణదేవరాయ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాధికారి గోవిందరాజులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను అందరం కలిసికట్టుగా పటిష్టపరచాలని ఆయన అన్నారు. పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థుల, యూనిఫాం, లైబ్రరీ వినియోగం గురించి ప్రధానోపాధ్యాయులనుఅడిగి తెలుసుకున్నారు. గణితం, సామాన్యం, తెలుగు, ఇంగ్లీష్ లలో విద్యార్థుల ప్రతిభను తెలుసు కున్నారు. ప్రభుత్వ పాఠశాలలోగత సంవత్సరాల కంటే ఇప్పుడు ఎక్కువ మంది విద్యార్థులు చేరుతున్నట్లుగా ఆయన తెలిపారు. ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉంది.కావునా విద్యార్థుల సంఖ్య పెంచా లని ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డికి, ఉపాధ్యాయులు వెంకటయ్య లకు సూచించారు.

# మహిళా మెడలో బంగారు గొలుసు అపహరణ

**వెల్దండ, జూన్ 28 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని తిమ్మినోనిపల్లి గ్రామానికి చెందిన అనిశెట్టి రమాదేవి తిమ్మినోనిపల్లి నుంచి వారి వదినతో కలిసి నడుచుకుంటూ కొత్ర గేటుకు వస్తున్న తరుణంలో శాస్త్ర ఇంటర్నేషనల్ పాఠశాల వెనుక భాగంలో ఇద్దరు వ్యక్తులు పల్సర్ బైక్‌పై వచ్చి రమాదేవి మెడలో ఉన్న మూడున్నర తులాల పుస్తెలతాడు, పుస్తెను లాక్కొని కొత్ర గేటు వైపుకు పరారైనట్లు బాధితురాలు పేర్కొన్నది. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలి తెలిపారు.

# పేదలకు వరప్రధాయిని సీఎం రిలీఫ్ ఫండ్

## - నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు పోతుగంటి రాములు



చెక్కులు అందజేస్తున్న ఎంపీ పోతుగంటి రాములు

**అచ్చంపేట, జూన్28 ప్రభాతవార్త:** పేదలకు వరప్రధాయిని సీఎం రిలీఫ్ ఫండ్ అని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు పోతుగంటి రాములు అన్నారు. పేద ప్రజలు కార్పొరేట్ స్థాయి వైద్యం పొందడానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో భరోసానిస్తుందని ఆయన తెలిపారు. అచ్చంపేటకు చెందిన ఆనంద్‌కు రూ.50వేలు, కల్వకుర్తి మండలం పంజుగులకు చెందిన సుజాతకు రూ.54వేలు, మాడ్గుల మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌కు రూ.36వేలు, తిరుపతికి రూ.18వేల చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంపీ రాములు బుధవారం ఆయన నివాసంలో బాధిత లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ వల్ల ఎంతో మంది నిరుపేదలు లబ్ధి పొందారని, నిరుపేదలు ఎంతో ధైర్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ప్రాణాలతో జీవిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రమాదాల్లో గాయపడ్డవారు,అనారోగ్యాలతో బాధపడుతున్న వారు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ఆర్థిక సహాయం కోసం సీఎంరిలీఫ్ ఫండ్‌కుధరఖాస్తు చేసుకునే అవకాశాన్ని సీఎం కల్పించారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే నిధుల మంజూరు



శాలివాహన సంఘం సభ్యులతో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

**కల్వకుర్తి, జూన్28 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని శాలివాహన సంఘం భవనానికి ప్రహరిగోడ మరియు ఎల్లికల్ రోడ్డు నుంచి సిలాంపల్లికి వెళ్లే డొంక రోడ్డు పనుల సమస్యలపై శాలివాహన సంఘం సభ్యులు, సిలార్‌పల్లి ప్రజలు బుధవారం మునిస్పల్ చైర్మన్ ఎడ్మ సత్యంను కలిసి సమస్యలను వివరించారు. స్పందించిన మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం వెంటనే ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ దృష్టికి చరవాణి ద్వారా సమస్యను తీసుకెళ్లగా స్పందించిన ఆయన వెంటనే ప్రహరిగోడ నిర్మాణానికి రూ.5లక్షలు, డొంక రోడ్డు పనులకు రూ.5లక్షల మంజూరు చేస్తానని హామీ ఇవ్వడమైనది. కార్యక్రమంలో మాజీ చైర్మన్ రాచోటి శ్రీశైలం, శాలివాహన సంఘం తాలూకా అధ్యక్షులు జగదీష్, టౌన్ అధ్యక్షులు సత్యం, మధు,శ్రీనివాసులు,పర్వతాలు,సిద్దప్ప, టేకులపల్లి లక్ష్మయ్య, కృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజశేఖర్, సంతోష్, భీమయ్య, లక్ష్మయ్య ఉన్నారు.

# వనపర్తి పట్టణంలో భూ మాఫియాను అరికట్టాలి

## అక్రమ వెంచర్లు,డబుల్ రిజిస్ట్రేషన్లు చేసే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి : అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అచలపక్ష ఐక్యవేదిక నాయకులు

**వనపర్తి టౌన్, జూన్28, ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలో అక్రమ వెంచర్లు డబుల్ రిజిస్ట్రేషన్లు చేసే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అచలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సతీష్ యాదవ్ మాట్లాడుతూ... వనపర్తిలోని గోపాల్‌పేట రోడ్డులో ఉన్న డిగ్రీ కళాశాల దగ్గర రాఘవేంద్ర కాలనీ సీ బ్లాక్ వెంచర్‌లో గతంలో లే అవుట్ చేసి ప్లాట్లు అమ్మడం జరిగిందని, కొన్ని రోజుల తరువాత దుర్బుద్ధి పుట్టిన వెంచర్ ఓనర్లు 30 ఫీట్ల రోడ్డును ప్లాటుగా చేసి, బై నంబర్లుగా ప్లాట్లు వేసి కొందరికి అమ్మడం జరిగిందని ఆయన ఆరోపించారు. గతంలో పక్క ప్లాటు వారికి రోడ్డు చూపించడం జరిగిందని, కార్నర్ ప్లాట్లు చూయిస్తు అమ్మిన తరువాత వారికి తెలియకుండా ఇలా మోసం చేయడం తగదని బాధితులు అచలపక్ష ఐక్యవేదికను సంప్రదించడం జరిగిందన్నారు. వారి అభ్యర్థన మేరకు పూర్వపరాలు పరిశీలించిన అచలపక్ష ఐక్యవేదిక గత ప్లాను, ఇప్పుడు మార్చిన దొంగ ప్లాను చూసి రిజిస్ట్రార్‌కు పూర్తి వివరాలు అందజేసి దొంగ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా ఆపాలని ఆయన డిమాండ్ చేశారు.రిజిస్ట్రార్ సాను కూలంగా స్పందించి నిర్ణయం తీసుకుంటామని తెలపడం జరిగిందన్నారు. వనపర్తి జిల్లాలో రెచ్చిపోతున్న భూ మాఫియా, రియల్ మాఫియా, మట్టి మాఫియాలను అరికట్టాలని, చాలా వెంచర్లను ఇష్టానుసారంగా ప్రభుత్వ భూమి కూడా ఆక్రమించి వేస్తున్నారని, దానికి కొందరు చోటా, మోటా నాయకులు అండగా ఉంటున్నారని, అలాగే కొందరు రెవెన్యూ ఆఫీసర్ల అండ ఉందని వారిని గుర్తించి శిక్షించాలని జిల్లా కలెక్టర్‌కు సంబంధిత అధికారులకు అచలపక్ష ఐక్యవేదిక డిమాండ్ చేస్తుందని ఆయన అన్నారు. గతంలో పలు వెంచర్లపై ఇచ్చిన ఫిర్యాదులను పరిగణలోకి తీసుకోకుంటే లోకాయుక్తకు, హైకోర్టుకు విన్నవించుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సతీష్ యాదవ్,నాయకులు బొడ్డుపల్లి సతీష్ కుమార్, జానంపేట రాములు, కానిస్టేబుల్ సహదేవుడు, ప్రసాద్, మురారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు జయంతి



మాజీ ప్రధాని పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**వనపర్తి టౌన్, జూన్28, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నర సింహారావు జయంతి వేడుకలను బుధవారం వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,కాంగ్రెస్ పార్టీఅభిమానులు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్ మాట్లాడుతూ...ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన దార్శ నికుడు బహుభాషా కోవిదుడు గొప్ప మనసున్న మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి ఉత్సవాలు జరుపుకోవడం కాంగ్రెస్ పార్టీకి ఎంతో గర్వకారణం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షులు కోట్ల రవి, మైనార్టీ జిల్లా అధ్యక్షులు సమ్మద్ మియా ,వనపర్తి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు, కౌన్సిలర్ సుమిత్ర యాదవ్, మాజీ కౌన్సిలర్ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు కృష్ణ బాబు, వనపర్తి జిల్లా నాయకులు చీర్ల జనార్ధన్, మాజీ సర్పంచ్ సురేష్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బాబా, వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ వెంకటేష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొంబాయి మన్యంకొండ, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు జానకి రాములు, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులు ఇర్షాద్, సేవాదళ్ వెంకటేష్, ఎస్టీ సెల్ టౌన్ అధ్యక్షులు ఎల్లన్న, అబ్దుల్లా, జానంపేట నాగరాజు మసికొండ భాస్కర్ రాంజీ, వెంకటేష్, ఆవుల వెంకటేష్, లౌక్య నాయక్,గంధం లక్ష్మయ్య, మల్లిరెడ్డి, ద్యారపోగు విజయ్, తిరుపతయ్య, కిష్టగిరి వెంకటస్వామి, దొడగుంటపల్లి రాములు, రాంబాబు, ఆర్‌బి రవి సాగర్, నరేష్ సాగర్, షణ్ముఖ నాయుడు, నరేష్,బషీర్ తదితరులు పాల్గొన్నారు.

# నాసిరకంగా బ్రిడ్జి నిర్మించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

**అమరచింత,జూన్28,ప్రభాతవార్త:** అమరచింతలోని కొంకనివానిపల్లి , మద్దూరు గ్రామాల మధ్య ఊర వాగుపై రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని గ్రామ ప్రజలు చేసిన ఎన్నో పోరాటాల ఫలితంగా ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి బ్రిడ్జి నిర్మాణానికి 5 లక్షలు కేటాయించారు. గత 8 నెలల క్రితం ఎమ్మెల్యే బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేశారు. మొదట బ్రిడ్జి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించగా కాంట్రాక్టర్ పిన్నంచర్ల వెంకటేష్ మూడు పైపులు రెండు సైడ్ గోడలతో బ్రిడ్జి నిర్మించి దానిపై మట్టి పోసి వదిలేశారని సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు ఎండి కుతుబ్ గ్రామ కార్యదర్శి మల్లేష్ ఆరోపించారు. బుధవారం ఊర వాగుపై నిర్మించిన బ్రిడ్జిని స్థానిక సీపీఐ నాయకులతో పరిశీలించారు. అత్యంత తక్కువ ఎత్తులో నాసిరకంగా కాంట్రాక్టర్ వెంకటేష్ బ్రిడ్జిని నిర్మించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వర్షాకాలంలో ఊరవాగు వస్తే బ్రిడ్జి పైనే వర్షపు నీరు పారుతుందని ఆరోపించారు. బ్రిడ్జిని నాసిరకంగా నిర్మించడమే కాకుండా కాంట్రాక్టర్ మరో ఐదు లక్షలు నిర్మాణానికి పెంచాలని కోరడం చూస్తే ఆయన ఎంత అవినీతికి పాల్పడుతుందో అర్థమవుతుందని అన్నారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి కాంట్రాక్టర్ అవినీతికి పాల్పడినట్లు వారు ఆరోపించారు. సంబంధిత అధికారులు ఎమ్మెల్యే కల్పించుకుని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని కుతుబ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆటో అంజి , కృష్ణయ్య పాల్గొన్నారు.

# నేడు మల్లెలతీర్థంలో అన్నదానం

**అచ్చంపేట, జూన్ 28 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలోని మల్లెల తీర్థం క్షేత్రంలో తొలి ఏకాదశిని పురస్కరించుకొని గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ మల్లిఖార్జున సేవా సమితి బాధ్యులు వెంకటయ్య, నరేందర్, రమేష్‌లు తెలిపారు. ప్రతి యేడాది నాగర్‌కర్నూల్ మల్లిఖార్జున సేవా సమితి ఆధ్వర్యంలో మల్లెల తీర్థం క్షేత్రంలో తొలి ఏకాదశిని పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులు సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

# నేడు కుమ్మెరలో ఈద్గా ప్రారంభం



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్28 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని కుమ్మెర గ్రామంలో నూతనంగా నిర్మించిన ఈద్గాను గురువారం బక్రీద్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈద్ ఉల్ జుహా నమాజ్ సందర్భంగా ప్రారంభించనున్నట్లు మస్జిద్ కమిటీ అధ్యక్షులు ఎండీ.షబ్బీర్, ఉపాధ్యక్షులు మొహమ్మద్ యూసుఫ్‌బాబాలు తెలిపారు. ఈద్గా స్థలంలో గ్రామ సర్పంచ్ గడ్డంపల్లి శ్రీదేవి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్మాణాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా గురువారం నిర్వహించే ఈద్ ఉల్ జుహా నమాజ్‌తో ఈద్గా ప్రారంభోత్సవం చేపడుతున్నామని, నిర్మాణాన్ని చేపట్టిన సర్పంచ్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, అధికారులకు ముస్లిం సోదరులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం



**వెల్దండ, జూన్ 29 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని బర్కత్‌పల్లి గ్రామంలోని 6వ వార్డులో సర్పంచ్ భీరయ్య, బీఆర్ఎస్ నాయకులు గోపాల నాయక్‌లు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చడమే తమ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్సింహ్మా,జంగయ్య, రాజు, శ్రీకాంత్‌రెడ్డి, విజయ్‌కుమార్, కళమ్మ ఉన్నారు.

# నేడు అమరచింతకు బండి సంజయ్ రాక

**అమరచింత, జూన్28, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా బీజేపీ చేపట్టిన మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగాతెలంగాణలో 119 నియోజకవర్గాలలో బీజేపీ బహిరంగ సభలను నిర్వహిస్తుందని అందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ఆత్మకూర్‌లో నిర్వహించే బహిరంగ సభకు హాజరవుతారని మున్సిపల్ పట్టణ అధ్యక్షులు క్యామ భాస్కర్ తెలిపారు. ముందుగా చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తి దేవస్థానంలో ప్రత్యేక పూజల అనంతరం అల్లిపూర్ మీదుగా అమరచింత శ్రీకృష్ణ నగర్‌కు చేరుకుంటారని, అనంతరం శ్రీకృష్ణ నగర్ నుండి రాజీవ్ గాంధీ మార్గం ద్వారా బీజేపీ జెండా కట్టదగ్గరకు చేరుకుని జెండావిష్కరణ చేస్తారని తెలిపారు. అనంతరం బైక్ ర్యాలీ ద్వారా ఆత్మకూర్‌లో నిర్వహించే బహిరంగ సభకు చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని బీజేపీ కార్యకర్తలు, మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# గో హత్యలను అడ్డుకోండి



**ఉట్కూర్,జూన్ 28 ప్రభాతవార్త:** హిందువులు పవిత్రంగా ఆరాధించే గోవులను కొంతమంది దుండగులు అక్రమంగా తరలించి వధించడం జరుగుతుంది. బక్రీద్ పండగ సందర్భంగా గోవులను వదిస్తే ఊరుకునేది లేదని హిందూవాహిని నగర అధ్యక్షులు ధర్మప్రకాష్ హెచ్చరించారు. ఈ విషయంలో తహసిల్దార్, ఎస్సై రమేష్‌లు ప్రత్యేక చొరవ చొరవ తీసుకుని ఇలాంటివి జరగకుండా ప్రత్యేక చొరవ తీసుకుని ఇలాంటివి జరగకుండాచట్టరీత్యా చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాల నాయకులు స్థానిక ఎస్సైకి వినతి పత్రం సమర్పించారు.కార్యక్రమంలోబిజెవైఎంనగర అధ్యక్షులు రమేష్, ఎబివిపి మండల నాయకులు బాలాంజనేయులు,ఎస్డీఎఫ్ కన్వీనర్ అరుణ్, సంఘం సభ్యులు అవినాష్,శంకర్,అజయ్,అరవింద్,నవీన్, అర్జున్, శ్రీకాంత్, శివ పాల్గొన్నారు.

# ముదిరాజులను దూషించిన సైకో కౌశిక్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి



**ఖిల్లాఘణపురం, జూన్28, ప్రభాతవార్త:** రాజ్యాంగబద్ధమైన ఎమ్మెల్సీ పదవిలో అధికార మదమెక్కి ముదిరాజ్ సామాజిక వర్గాన్ని అసభ్య పదజాలంతో దూషిం చిన సైకో కౌశిక్ రెడ్డిని ఎమ్మెల్సీ పదవి నుండి తొలగించి జైల్లో పెట్టాలని కోరుతూ తెలంగాణ ముదిరాజ్ సంఘం ఖిల్లాఘణపురం మండల నాయకులు ఆంజనేయులు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సైకో కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు జింకల కృష్ణయ్య,బి.కృష్ణ, పెద్దిరాజుమాట్లాడుతూ...ఎమ్మెల్సీ పదవిలో బాధ్యాతాయు తంగా ఉండవలసిన సైకో కౌశిక్‌రెడ్డి ముదిరాజ్ జాతికి చెందిన యూట్యూబ్ జర్నలిస్టును బంధించి చిత్రహింసలకు గురి చేసి అసభ్య పదజాలంతో దూషిం చిన సంఘటనను ముదిరాజ్ సంఘం తీవ్రంగా ఖండిస్తుందని ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి ముదిరాజ్ జాతికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, తెలంగాణ ముఖ్య మంత్రి కేసీఆర్ వెంటనే పదవి నుండి తొలగించి అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలనిలేని పక్షంలో భవిష్యత్తులోజరిగే ఎన్నికల్లో తెలంగాణలోనే అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ బిడ్డల ఆగ్రహానికి గురికాక తప్పదని, కౌశిక్ రెడ్డిని పదవి నుండి దించేసి అరెస్టు చేసే వరకు ఆందోళనలు కొనసాగుతూ ఉంటాయని జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సిన ఉంటుందని పేర్కొన్నారు.

# త్యాగానికి నిలువెత్తు నిదర్శనం బక్రీద్ పండుగ

▸▸నేడు బక్రీద్ పండుగ వేడుకలు ▸▸ఖుర్బానీలకు ఏర్పాట్లు పూర్తి ▸▸జిల్లాలో ఈద్-ఉల్-ఆదా పండుగకు ఈద్గాలు (ప్రార్థన స్థలాలు) ముస్తాబు





ముస్తాబైన ఈద్గా, ఆలింగనం చేసుకొంటున్న బాలురు

**దేవరకద్ర, జూన్ 28 ప్రభాతవార్త:** త్యాగానికి నిలువెత్తు నిదర్శనం బక్రిద్ పండుగ...అంతటి విశిష్టత గల బక్రిద్ పండుగ వేడుకలను జిల్లాలోని ముస్లిం సోదరులు గురువారం జరుపుకోనున్నారు...దీనికి గాను పండుగకు ముస్లిం సోదరులు అన్ని ఏర్పాట్లు చేసుకొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రార్థనస్థలాలైన ఈద్గాలు(ప్రార్థన స్థలాలు)లను ముస్తాబు వెల్ల వేసి,రంగులు వేసి సిద్దం చేశారు. రంగు రంగుల విద్యుత్‌బల్బులతో శోభాయమానంగా అలంకరించారు. ఈద్గా ఆవరణలను శుభ్రం చేశారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం జిల్‌హజ్జా మాసంలో ఈ పండుగను జరుపుకొంటారు.

**హజ్రత్ ఇబ్రాహీం అలై సలాం ప్రవక్త సాంద్రాయమే ఖుర్బాని:** ముస్లిం సోదరులు ప్రతి ఏడాది బక్రిద్ పండుగ రోజు గొర్రెపొట్టేళ్ళను అల్లా మార్గంలో ఖుర్బాని ఇవ్వడం అనాదిగా సాంప్రదాయంగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ ఖుర్బానీలకు ముస్లింసోదరులు అన్ని ఏర్పాట్లు చేసుకొన్నారు. హజ్రత్ ఇబ్రాహీం అలై సలాం ప్రవక్త సాంద్రాయమే ఈ ఖుర్బాని అని అంటారు. ప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం అలై సలాం తన ప్రియ కుమారుడైనటువంటి ఇస్మాయిల్ అలై సలాం వారిని అల్లా మార్గంలో బలి ఇవ్వాలని ఆదేశం వచ్చినప్పుడు వెంటనే సంకోచం లేకుండా తన ప్రియ కుమారుడ్నిఅల్లా మార్గంలో బలి ఇవ్వడానికి ఆయన సిద్ధపడిపోయారు. అప్పుడు అల్లాహ్ ఇస్మాయిల్ అలై సలాం స్థానంలో ఒక మేక పొట్టేలును ఏర్పాటు చేసి ఇస్మాయిల్ అలై సలాంను అక్కడి నుండి తొలగించబడ్డారని అంటారు. ఈ విధంగా హజ్రత్ ఇబ్రాహీం అలై సలాం వారి సంకల్పాన్ని అల్లాహ్ స్వీకరించారంటారు. దీనిని భావితరాల వారికి ఓ పండుగలా చేయడం జరిగింది. దీని వల్ల మానవాళికి గుణపాఠం ఏమిటంటే.. ఒక వేళ మనం ఇష్టపడేటటువంటిది,ప్రియాతి ప్రియమైనటువంటిది కూడ దైవ మార్గంలో ఖర్చు పెట్టాలని ఆదేశం ఉన్నప్పుడు వెంటనే మనం మనకు ప్రియాతిప్రియమైనటువంటిదికూడ అల్లాహ్‌మార్గంలో మనం సమర్పించాలనేటటువంటి ఒక త్యాగాన్ని గుర్తుచేసుకోవడానికి ఈ పండుగను విశ్వాసులకోసం ఏర్పాటు చేయడం జరిగిందంటారు. అందుకే త్యాగినికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది ఈ బక్రిద్ పండుగ. అయితే ఇస్లాం క్యాలెండర్ ప్రాకారంలోని జిలహజ్జ నెలలో ఎవరు కూడ తన గోర్లు,వెంట్రుకలు కత్తిరించకూడదన్న నిబంధన కూడ ఉంది. ఆ నిబంధనను ముస్లిం సోదరులు తూచ తప్పకుండ పాటించాలన్న నిబంధన ఉంది. అందుకే ఆ నెలలో ముస్లిం సోదరులు ఎవరు కూడ వాటిని తొలగించుకోకుండా ఉంటారు. బక్రిద్ పండుగ తర్వాతనే వాటిని తొలగించుకొంటారు. అల్లాహ్ ఆదేశాను సారం స్థోమత కల్గిన ప్రతి ఒక్కరు ఖచ్చితంగా ఖుర్బాని ఇవ్వాలన్న నిబంధన కూడ అంది. ఒక వేళ ఎవరైతే ఆ నిబంధనను పాటించరో ఆ వ్యక్తి ప్రార్థనను అల్లాహ్ స్వీకరించరని అంటారు. అందుకే స్థోమత కల్గిన ప్రతి ఒక్కరు ఖుర్బాని ఇస్తారు. బక్రిద్ పండుగ నమాజు తర్వాతనే ఈఖుర్బాని ఇవ్వాలి. అంతకున్న ముందు ఖుర్బాని ఇస్తే అది చెల్లుబాటు కాదంటారు.



ఖుర్బాని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న గొర్రెపొట్టేలు

**పండుగకు ఈద్గాల(ప్రార్థన స్థలాలు) ముస్తాబు:** బక్రిద్ పండుగను పురస్కరించుకొని జిల్లాలోని ప్రార్థన స్థలాలైన ఈద్గాలను ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా పండుగ రోజు ముస్లింసోదరులు నూతన వస్త్రాలు ధరించి ఈద్గాల వద్దకు ఊరేగింపుగా నిర్దేశించిన సమయానికి వెళ్ళి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. రెండు రకాతుల ప్రత్యేక నమాజు చేసిన తరువాత ఖుద్బాను విని తరిస్తారు. అనంతరం కులమతాలకు అతీతంగా ఆలింగన చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొంటారు. ఇళ్ళ వద్దకు వచ్చి తీపి వంటకాలను ఆరగిస్తారు. దీనికి గాను ఈద్గాలకు వెల్ల వేసి ముస్తాబు చేశారు.

## బిజెపికి ఎదురుదెబ్బ

- పార్టీని వీడిన హన్వాడ మండల బిజెపి ప్రధాన కార్యదర్శి నంబి వేణుగోపాల్ యాదవ్
- మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరిక
- అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వెల్లడి



వేణుగోపాల్ యాదవ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 28 ప్రభాతవార్త:** రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మహబూబ్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని హన్వాడ మండల బిజెపి ప్రధాన కార్యదర్శి నంబి వేణుగోపాల్ యాదవ్ బిఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కెసిఆర్ సహకారంతో రాష్ట్రమంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ గత 70 ఏళ్ల నుండి అభివృద్ధికి దూరంగా ఉన్న మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం పట్ల, బిఆర్ఎస్ పార్టీ విధానాల పట్ల ఆకర్షితులై బిజెపి పార్టీకి రాజీనామా చేసి బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కెసిఆర్ రాష్ట్రఅభివృద్ధికి ఎంతోకృషి చేస్తున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నిరంతర విద్యుత్ దళితబంధురైతుబంధు, రైతుభీమా, కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ గ్రామాల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఇరు రాష్ట్రాలకు అభివృద్ధి సంక్షేమపథకాలఅమలులో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. క్రమశిక్షణతో పార్టీలో పనిచేస్తే పార్టీలో ఎంతో భవిష్యత్తు ఉంటుందన్నారు. నంబి వేణుగోపాల్ యాదవ్‌కు బిఆర్ఎస్ పార్టీలో చేరినందుకు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా నంబి వేణుగోపాల్ యాదవ్‌కు బిఆర్ఎస్ పార్టీ కండువా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో హన్వాడ మండల మాజీ ఎంపిపి వడ్లశేఖర్,సింగిల్ విండో వైస్ ఛైర్మన్ కృష్ణయ్యగౌడ్,మండల కో ఆప్షన్ సభ్యులు ఎండి మన్నన్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, సాయిలు,ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పాలశీతలీకరణ కేంద్రం ప్రారంభం



పాలశీతలీకరణ కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

**గండీడ్, జూన్ 28 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధి రూర్బన్‌వారి సహకారంతో 2.80లక్షల నిధులతో నిర్మించిన పాలశీతలీకరణ కేంద్రం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్వర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ పాలశీతలీకరణ కేంద్రం వల్ల రైతులకు ఎంతో అభివృద్ధి, కుటుంబ వ్యవస్థ మెరుగుపడుతుంది. రైతులకు సబ్సిడి లోన్లు , కెసిఆర్ సర్కార్ వచ్చిన తర్వాత రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లారన్నారు. పల్లెప్రగతి కోసం ఎన్నో రకాల పనులు చేపట్టారు. రైతులకు సబ్సిడి లోన్లు, చెక్కులు అందించారు. కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ఛైర్మన్ సోమ భరత్‌కుమార్, ఎండి అధర్ సింహ,కలెక్టర్ రవినాయక్,జిల్లా ఛైర్మన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, జడ్పీటిసి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిపి మాధవిరాజ్‌కుమార్‌రెడ్డి, మండల ప్రెసిడెంట్, పార్టీ నాయకులు, మీడియా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

**నారాయణపేట ప్రతినిధి,జూన్28 ప్రభాతవార్త:** మానవ హక్కుల పరిరక్షణ, అవినీతి నిర్మూలన కోసం హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ ఫోరం (హెచ్‌ఆర్‌ఏసిఎఫ్) సంస్థ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ హర్ష, ఎస్పీ వెంకటేశ్వర్లు, సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టరు, ఎస్పీతో పాటు జడ్జిలను మర్యాదపూర్వకంగా కలిసి మానవ హక్కుల పరిరక్షణపై సభ్యులు చర్చించారు. సమాజంలో పౌరుల హక్కులకు ఎలాంటి సమస్యలు వచ్చినా వారి తరపున సంస్థ కృషి చేయాలని అధికారులు సూచించారు. సమాజానికి ప్రభుత్వానికి మధ్య అనుసంధానకర్తగా వ్యవహరించాలని అన్నారు. ఇటు సంస్థ బృందం మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు తమ సంస్థ కృషి చేస్తుందని అన్నారు. పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకు ప్రతి ఒక్కరికి రాజ్యాంగం కనీస హక్కుల కల్పించిందని వాటి పరిరక్షణ కోసం కృషి చేస్తామని అన్నారు. సమాజంలో అవినీతి నిర్మూలన కోసం తమవంతు పాత్ర పోషిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నారాయణపేట జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి డా. శ్రీరామ్,ఉపాధ్యక్షులుగవినోళ్ల జైపాల్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రమేష్‌రావు పాల్గొన్నారు.



## కార్పొరేట్ ఆసుపత్రుల్లో పెన్షనర్స్‌కు నగదు రహిత చికిత్స అందించాలి

- రెండు విడతల కరువు భత్యం ప్రకటించాలి
- కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శనలో జేఏసీ డిమాండ్

**వనపర్తి, జూన్28, ప్రభాతవార్త:** అన్ని కార్పోరేట్ ఆసుపత్రుల్లో పెన్షనర్స్‌కు నగదు రహిత చికిత్స అందించాలని కలెక్టర్ కార్యాలయం వద్ద పెన్షనర్స్ జేఏసీ సభ్యులు నిరసన వ్యక్తం చేసి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు అగ్గి రాముడు, వేణుగోపాల్, యోసేపు లు మాటాడుతూ... రెండు విడతల కరువు భత్యం ప్రకటించాలని, రెండవ పీఆర్‌సీని నియమించాలని, జూలై 1 నుండి మధ్యంతర భృతిని అందించాలని, 398 నిర్ణీత వేతనంతో స్పెషల్ టీచర్స్‌గా పని చేసిన ఉపాధ్యాయులకు వారు పని చేసిన కాలానికి నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరుకు గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, నేషనల్ ఇంక్రిమెంట్స్‌ను పెన్షన్‌కు గుర్తింపు ఇవ్వాలని, కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ప్రతి జిల్లాకు రెండు వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి సరిపడిన మందులు అందుబాటులో ఉంచాలని వారు డిమాండ్ చేశారు. వివిధ ప్రభుత్వ శాఖలో పని చేసిన రిటైర్డ్ ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్ జేఏసీగా ఏర్పడి జరిపిన ఈ నిరసన ప్రదర్శన కార్యక్రమం విజయవంతమైందని అన్నారు. కలెక్టర్ కార్యాలయం వద్ద నుండి నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన అనంతరం తమ డిమాండ్‌తో కూడిన విజ్ఞాపన పత్రాన్ని జిల్లా కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు అందజేశారు.




నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నాయకులు

## రైతులకు న్యాయం చేయాలని ధర్నా

**కల్వకుర్తి, జూన్ 28 ప్రభాతవార్త:** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే రైస్ మిల్లర్లు అనేక అవస్థలు పెట్టడమే కాకుండా తూకంలో దోపిడికి గురి చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రైస్ మిల్లర్ల దోపిడి నుంచి రైతులను కాపాడాలని డిమాండ్ చేస్తూ తర్నికల్ గ్రామ రైతులు పెద్ద ఎత్తున తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు యూత్ కాంగ్రెస్ తాలూకా అధ్యక్షులు అనిల్‌గౌడ్ రైతులకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. పంట విక్రయించుకునే సమయంలో రైతు మిల్లర్ల దోపిడి వల్ల మరింత నష్టపోతున్నారని, ఒక బస్తా నుంచి 9 కిలోల తరుగు తీస్తున్నారని, దీంతో పేద రైతులకు పంటకు పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తరుగు తీస్తున్న మిల్లర్లపై తగిన చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాంరెడ్డిరైతులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో రైతులు తదితరులు ఉన్నారు.



ధర్నా చేపడుతున్న రైతులు

## 50వ రోజుకు చేరిన రిలే దీక్షలు

**నారాయణపేట ప్రతినిధి,జూన్ 28 ప్రభాతవార్త:** కోటకొండ గ్రామంలో కోటకొండ గ్రామాన్ని మండల కేంద్రంలో ప్రకటించాలని రిలేదీక్షలు కొనసాగుతున్నాయి. 50వ రోజు దీక్షల సందర్భంగా వంటావార్పు, బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమానికి రాము అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి. రంగారావు, బిజెపి రాష్ట్ర నాయకులు నాగూరావు నామోజీ, హర్షవర్ధన్‌రెడ్డి, పిసిసిరాష్ట్ర అధికార ప్రతినిధి వెంకట్‌రాములు, సిపిఎం రాష్ట్ర నాయకులు పాల్గొని మాట్లాడారు. నారాయణపేట మండలం పెద్ద గ్రామమైన కోటకొండను మండల కేంద్రంగా ప్రకటించాలని గత 50 రోజులుగా రిలే దీక్షలు కొనసాగుతున్నాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి స్పందించకపోవడం విడ్డూరంగాఉందన్నారు. 50వరోజు దీక్షలో జడ్పీ హెచ్‌ఎస్ పాఠశాల 10వ తరగతి విద్యార్థులు దీక్షలో ఉన్నారు. బహిరంగ సభలో ప్రజాపంథా రాష్ట్ర నాయకులు ఎం. హన్మేష్, బిజెపి జిల్లా అధ్యక్షులు పగుడాకుల శ్రీనివాస్, రాము, బిజెపి రాష్ట్ర నాయకులు కెంచి శ్రీనివాసు,గ్రామ సర్పంచ్ జయలక్ష్మి, ఎంపిటిసిలు అనసూయ, కె. సునిత, మండల కోకన్వీనర్ కె.కాశినాథ్, బి.యాదగిరి, ఎడ్లరాజు, సకా ప్రవీణ్, మాల బాలప్ప,వెంకట్‌రాములు,హాజి,ప్రతాప్, కృష్ణ, ప్రశాంత్, సుధాకర్, దస్తప్ప, లక్ష్మయ్యలతో పాటు యువకులు కూర్చున్నారు. సౌజన్య, సలం, ఎ.నర్సింములు, రవి,మల్లేష్, హాజి, ప్రతాప్, కృష్ణ, ప్రశాంత్, సుధాక్, దస్తప్ప, లక్ష్మయ్యలు పాల్గొన్నారు.



దీక్షలో మాట్లాడుతున్న నాయకులు

## విద్యార్థులకు నైతిక విలువలు బోధించాలి

- భారత సేవా శ్రమ సంఘం కార్యదర్శి స్వామి మునీశ్వరానందజీ - లక్ష్మీపల్లిలో విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాల పంపిణీ

**దేవరకద్ర, జూన్ 28 ప్రభాతవార్త:** విద్యార్థులకు చదువతో పాటు నైతిక విలువలను కూడ బోధించాలని భారత సేవా శ్రమ సంఘం కార్యదర్శి స్వామి మునీశ్వరానందజీ అన్నారు. పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు,జూనియర్ రెడ్‌క్రాస్ సమన్వయకర్త అశ్విని చంద్రశేఖర్ అభ్యర్థన మేరకు బుధవారం దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాల విధ్యార్థులకు భారత సేవాశ్రమ సంఘం అధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి భారత సేవా శ్రమ సంఘం కార్యదర్శి స్వామి మునీశ్వరానందజి ముఖ్య అతిథిగా హాజరై తమ అమూల్యమైన సందేశాన్ని ఇచ్చారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ కూడ అవసరమన్నారు. అలాగే వారిలో నైతిక విలువలను పెంపొందించడానికి ప్రయత్నించాల్సిన భాద్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. విద్యార్థులు చిన్నప్పటినుండే నిజాయితి,ప్రేమ, కష్టపడే తత్వం, ధైర్యం వంటి విలువలను పాటించడం ద్వారా జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకొంటారని ఆయన అన్నారు. దీనికిగాను పాఠశాల స్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మహనీయులు విలువలప్రకారం జీవించడం వల్లనే గొప్ప పేరు ప్రతిష్టలు తెచ్చుకొన్నారన్నారు.

**విద్యలో రాణిస్తేనే మంచి భవిష్యత్తు: రెడ్‌క్రాస్ ఛైర్మన్ నటరాజ్**

విధ్యార్థులు విద్యలో రాణిస్తేనే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని రెడ్‌క్రాస్ చైర్మెన్ నటరాజ్ అన్నారు. లక్ష్మీపల్లిలో జరిగిన కార్యక్రమానికి రెడ్‌క్రాస్ చైర్మెన్ నటరాజ్ హాజరై ప్రసంగించారు. విద్యార్థులు పేదరికాన్ని అధిగమించి విద్యలో రాణించాలన్నారు. అప్పుడేవారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వం,దాతలు ఇస్తున్న సహకారంతో విద్యార్థులు శ్రద్దతో చదివి ఉన్నత స్థాయికి ఎదుగాలన్నారు.

**సేవాశ్రమ సేవలు భేష్: అశ్విని చంద్రశేఖర్**

భారత సేవా శ్రమ సంఘం సేవలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఓ వరం లాంటిందని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు,జూనియర్ రెడ్‌క్రాస్ సమన్వయకర్త అశ్విని చంద్రశేఖర్ అన్నారు. భారత సేవా శ్రమ సంఘం కార్యదర్శి స్వామి మునీశ్వరానందజి నేతృత్వంలో గత 15 ఏళ్ళుగా జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకుఉచితంగానోటు పుస్తకాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇది హర్షించ దగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీపల్లి పాఠశాలలోని దాదాపు 300 మంది విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల తరపున స్వామి మునీశ్వరానందజిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు,ఉపాధ్యాయుడు అశ్విని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీపల్లిలో నోటుపుస్తకాలను అందజేస్తున్న స్వామి మునీశ్వరానందజీ

## కౌశిక్‌రెడ్డిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలి

**కెటిదొడ్డి, జూన్ 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నందిన్నె గ్రామంలో ముదిరాజ్ మహాసభ గద్వాల తాలూకా ప్రధాన కార్యదర్శి రొడ్డబోయిన రాఘవేంద్ర ఆధ్వర్యంలో సమావేశం అయి ముదిరాజ్‌లకు జరిగిన అవమానాన్ని భరించలేక అందరు ముక్తకంఠంతో ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని ముదిరాజ్‌లు నినాదాలు చేశారు. కార్యక్రమంలో తాలూకా ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర, వివిధ గ్రామాల సొసైటీ అధ్యక్షులు, కుచినేర్ల రమేష్, గువ్వలదిన్నె వెంకటేష్, కొండపురం భీమేష్, ఇర్కిచేడ్ చంద్రయ్య పాల్గొన్నారు.



కౌశిక్‌రెడ్డిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్న ముదిరాజ్‌లు

## కారును ఢీకొన్న బస్సు.. ప్రయాణికులకు తప్పిన ప్రమాదం



అదుపు తప్పి గుంతలోకి దూసుకువెళ్లిన ఆర్టీసీ బస్సు

**పెబ్బేరు, జూన్28, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై కారును ఢీకొట్టి రోడ్డు పక్కన గుంతలోకి దూసుకెళ్లడంతో పెను ప్రమాదం తప్పిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుండి కర్నూల్ వైపు వెళ్తున్న బనగానపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హోటల్లో భోజనం చేసేందుకు బస్సును అకస్మాత్తుగా మలుపు తిప్పడంతో హైదరాబాద్ నుండి కర్నూల్ వెళ్లే కారును ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకుపోయింది. బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదని ఎస్ఐ తెలిపారు. కారు డ్రైవర్ ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## వర్నె వాగు బ్రిడ్జి రోడ్డు స్థల సేకరణకు స్థానిక రైతులతో చర్చించిన జడ్పీటీసీ, ఎంపీపీ



రైతులతో చర్చిస్తున్న మండల జడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి, ఎంపీపీ దోనూరు నాగార్జున రెడ్డి

**అడ్డాకుల, జూన్28, ప్రభాతవార్త:** అడ్డాకుల మండలం వర్నే ముత్యాలంపల్లి తదితర గ్రామాలకు వర్నెవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం పనులు తుది దశకు చేరుకున్నాయి. బ్రిడ్జి రోడ్డు భూ సేకరణ కొరకు స్థానిక రైతులతో జడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ నాగార్జున రెడ్డి చర్చించారు. ఈ కార్యక్రమంలో అడ్డాకుల మండల సింగిల్‌విండో అధ్యక్షులు మద్దూరి జితేందర్‌రెడ్డి,వర్నె గ్రామ స్థానిక సర్పంచ్ బంగారయ్య, ఎంపీటీసీ అనిత సుధాకర్‌రెడ్డి,మాజీ సర్పంచ్ కొండన్నయాదవ్, మాజీ ఎంపీటీసీ సత్యరెడ్డి, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న స్వీపర్ల దీక్షలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్28, ప్రభాతవార్త:** పాఠశాలలో పని చేసే స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద స్వీపర్లు నిర్వహిస్తున్న ఆందోళన మూడో రోజుకు చేరుకున్నది. రాష్ట్రంలో అన్ని పాఠశాలలో స్వీపర్లు దశాబ్ద కాలంగా కేవలంరూ.1623, కొంతమంది మాత్రం రూ.4వేలకు పని చేస్తున్నారని వారు ఆ జీతంలో కుటుంబాన్ని ఎలా రెట్టుకొస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ టీచర్లు ఉంటారని,మరీ ప్రభుత్వ స్వీపర్లు ఎందుకు ఉండరని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అందరినీ రెగ్యులరైజ్ చేయాలని,సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ విరమణ తర్వాత రూ.10లోలగ్రాట్యుటీతోపాటు ప్రతి నెలా రూ.10500 పెన్షన్ ఇవ్వాలని, ఆరోగ్య కార్డులు ఇవ్వాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలోస్వీపర్ల సంఘంజిల్లా అధ్యక్షుడు గట్టన్న, టీఎఫ్‌యూ జిల్లా అధ్యక్షుడు పి విజయ్‌కుమార్, స్వీపర్లు పాల్గొన్నారు.

## రేపటిలోగా గెస్ట్ లెక్చర్లలకు దరఖాస్తుల ఆహ్వానం

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్28, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) గెస్ట్ లెక్చరర్లుగా పని చేసేందుకు అర్హత మరియు ఆసక్తి ఉన్నవారి దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రవీందర్, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ మేరజుల్లాఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిలాసఫీ, సోషియాలజీ, సైకాలజీ,సైన్స్ అండ్ పెడగాజి, మ్యాథమెటిక్స్ అండ్ పెడగాజి, సోషల్ సైన్స్ అండ్ పెడగాజి, ఇంగ్లీష్, తెలుగు, కంప్యూటర్ ఎడ్యుకేషన్,విజ్యువల్ ఆర్ట్స్ అండ్ ఆర్ట్స్, హెల్త్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌తోపాటు ఉర్దూ మీడియంలో సైన్స్ అండ్ పెడగాజి, ఫిలాసఫీ, సోషియాలజీ, మ్యాథమెటిక్స్ అండ్ పెడగాజి, సోషల్ సైన్స్ అండ్ పెడగాజి సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీ, ఎంఈడీ అర్హత కలిగి ఉండాలి. హెల్త్‌అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎంపీడీ, అదేవిధంగా విజ్యువల్ ఆర్ట్స్‌కు పీజీ లేదా బ్యాలలర్ డిగ్రీఫైన్ ఆర్ట్స్,మ్యూజిక్,డ్యాన్స్, థియేటర్ మొదలుగునవి అర్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల 30లోగా తమ దరఖాస్తులను విద్యార్థుల ధ్రువపత్రాలతో సహా డైట్‌కళాశాలలోసమర్పించాలని సూచించారు పూర్తి వివరాలకు 9949 993714 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## సివిల్స్ శిక్షణకు దరఖాస్తులకు నాలుగురోజులే గడువు

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 28, ప్రభాతవార్త:** 2023-24 విద్యా సంవత్సరానికిగానూ షెడ్యుల్డ్ కులాల అభివృద్ధి సంస్థకు చెందిన రాష్ట్ర ఎస్సీ స్టడీ సర్కిల్, బంజారా హిల్స్ హైదరాబాద్‌లో సివిల్స్ ప్రిలిమినరీ మరియు మెయిన్స్ సీ -సాట్ కోచింగ్‌కోచింగ్ కోసం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ కోచింగ్ కోసం రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి రాతపరీక్ష ద్వారా 100మందికి ఎంపిక చేస్తారు, ఎంపికైనవారికి ఉచిత భోజన వసతితో కూడిన 10నెలల కోచింగ్ ఇస్తారు. జూలై2 దరఖాస్తుకు చివరితేదీగా నిర్ణయించినట్లు మహబూబ్‌నగర్ ఎస్సీ స్టడీ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష జూలై9న నిర్వహించనున్నారు. పూర్తి వివరాలకు 04023546552 నెంబర్‌ను సంప్రదించాలి కోరారు.

## విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ



**ధరూర్, జూన్ 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బూరెడ్డిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు పెన్నులు సర్పంచ్ బండ్ల జ్యోతి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కెసిఆర్ విద్యా రంగానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని పేద విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్, భోజన సౌకర్యం, పుస్తకాలను అందించడం జరుగుతుందని అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో కూడా మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా రూపురేఖలు మార్చి డిఎల్ఎక్స్,తాగునీటి సౌకర్యం డిజిటల్ క్లాస్ అన్ని వసతులతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక సదుపాయాలు సమకూర్చి ఇంగ్లీష్‌విద్యను కూడా ప్రతి ఒక్క విద్యార్థి చదువుకునే లక్ష్యంగా తెలంగాణ సీఎం కెసిఆర్ నేతృత్వంలో విద్యాశాఖమంత్రి, ఎమ్మెల్యేల పరిరక్షణలో విద్యారంగం సంబంధించిన కార్యక్రమాలు సజావుగా కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడిజిల్లాకెటిఆర్‌యువసేన ప్రధానకార్యదర్శి కృష్ణకుమార్‌రెడ్డి, మహిళ నాయకురాలు రాధా, మధుమతి, పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా నేరస్థులకు ఆరు నెలల జైలు శిక్ష : జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి

**వనపర్తి క్రైమ్, జూన్28, ప్రభాతవార్త:** ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి హెచ్చరించారు. 2016 సం.లో వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది కొత్తకోట రోడ్డు నాగమ్మ తండా దగ్గర తెల్లవారుజామున 5గంటలకు గస్తీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ఇసుక లోడ్‌తో వస్తున్న లారీని గుర్తించిన పోలీసులు లారీని ఆపి ఇసుక రవాణా అనుమతులపై ఆరా తీయగా ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న అక్రమ ఇసుకన ఎక్కువ డబ్బులకు విక్రయించేందుకు వనపర్తికి వస్తున్నామని లారీ డ్రైవర్ పోలీసులకు తెలిపారు. లారీ డ్రైవర్ లోకమోని ఇంద్రయ్య ఫిర్యాదు మేరకు లారీ ఓనర్ లోకమోని కురుమూర్తి అని తెలిపారు. ఫిర్యాదుపై అప్పటి వనపర్తి రూరల్ ఎస్ఐ నాగశేఖర్ రెడ్డి కేసు నమోదు చేసి, అక్రమ ఇసుక రవాణా నేరస్తులైన ఇంద్రయ్య, కురుమూర్తి లపై ఛార్జీ షీట్ నమోదు చేసి విచారణ నిమిత్తం సాక్షులను వనపర్తి రెండు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు 6 మంది సాక్షులను అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునితాదేవి వాదనలను వినిపించారు. సాక్షుల వాదోపవాదాలు విన్న తరువాత జూనియర్ సివిల్ జడ్జి కమ్ సెకండ్ అడిషనల్ జానకి విచారణ నిమిత్తం కేసు రుజువు కావడంతో నిందితులకు ఆరు నెలల జైలు శిక్ష విధించారు. 09.02.2016న ఇసుక లారీనిరూరల్ ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ జువాలజీ (విజిలెన్స్) జడ్చర్ల వారికిలారీని అప్పగించి, లారీలోని ఇసుకకు డిపార్ట్‌మెంట్ వారు రూ.50వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్పీ రక్షిత కె.మూర్తి ఈ కేసులో నిందితులకు శిక్ష పడేందుకు బాగా పని చేసిన వనపర్తి సెకండ్ అడిషనల్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌సునితాదేవి, సీఐ మహేశ్వర్ , ఎస్ఐ నాగన్న, కోర్టు డ్యూటీ ఆఫీసర్ రాజేందర్‌లను ఎస్పీ అభినందించారు. త్వరలో రివార్డు అందించడం జరుగుతుందని తెలిపారు.

## ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**వనపర్తి, జూన్28, ప్రభాతవార్త:** ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఇంచార్జి బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ఐడివోసి కాంప్లెక్స్‌లోని జిల్లా బీసీ అభివద్ధి అధికారి కార్యాలయంలో వసతి గృహ సంక్షేమ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అయినందున వసతి గృహాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని దానికి అనుకూలంగా మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తు వసతి గృహంలోని వంటగది ఇతర పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. వసతి గృహంలోని సిబ్బంది సమయ పాలన పాటిస్తు విద్యార్థుల సమయానికి అనుగుణంగా భోజనాన్ని అందించాలని తెలిపారు. అంతకుముందు జిల్లా ఇంచార్జీ బీసీ అభివృద్ధి అధికారిగా బీరం సుబ్బారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న జిల్లా బీసీ అభివృద్ధి అధికారి అనిల్ కుమార్ సెలవుపై వెళ్లడంతో జిల్లా సహాయ బీసీ అభివృద్ధి అధికారిగా పని చేస్తున్న బీరం సుబ్బారెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తు ప్రిన్సిపాల్ సెక్రటరీ బీసీ సంక్షేమ శాఖ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు విధుల్లో చేరారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారులు, కార్యాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చాలీచాలని జీతాలతో దుర్భర జీవితం



**మహ్మదాబాద్, జూన్ 28 ప్రభాతవార్త:** మండలంలోని కార్యాలయం ముందు గ్రామ పంచాయతీ సిబ్బంది బుధవారం ధర్నా చేసి తహసిల్దార్ ఆంజనేయులు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమానికి గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నల్లవెల్లి కురుమూర్తి, వెంకటేష్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ మహ్మదబాద్ మండలంలో కొన్ని గ్రామ పంచాయతీలో ఐదు నెలలుగా వేతనాలు లేవని, అందరికి 10 లక్షల భీమా అసలు చేయలేదని, వారాంతపు సెలవులు అమలు కావడం లేదని, ఐడి కార్డులు అందరికి నేటికి ఇవ్వలేదని, కనీస వేతనం 26 వేలు అమలు పరచాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ జులై ఆరునుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సమ్మె సన్నాహక కమిటి అధ్యక్ష, కార్యదర్శులుగా సందీప్‌చరి, సహాయ కార్యదర్శిగా బాలరాజు, కోశాధికారిగా రాజు, కమిటి సభ్యులుగా సత్యమ్మ, చిట్టెమ్మ, వెంకటమ్మ, మొగులయ్య, నరసింహులు, లక్ష్మి, సలహాదారులుగా రాజేందర్ తదితరులు ఎన్నికైనట్లు వారుప్రకటించారు. ఇందులో శ్రీనివాసులు, రాములు, కిష్టయ్య, గోపాల్, లాలు, వెంకటయ్య, బాలకృష్ణయ్య పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన సిడిపిఓ

**మల్దకల్, జూన్28 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని పావనంపల్లి, పాల్వాయిగ్రామలలో అంగన్‌వాడి కేంద్రాలను సిడిపిఓ కమలాదేవి సూపర్‌వైజర్లతోకలిసి టీంగాసందర్శించారు. బుధ వారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించి బరువు తక్కువ, అతితక్కువ గల పిల్లల సంరక్షణ గురించి తల్లిదండ్రులతో మాట్లాడారు. కేంద్రంలో ఉన్న 20 నుండి 30 మంది పిల్లల బరువు, ఎత్తు ప్రత్యక్షంగా తూచి, మొబైల్‌లో నమోదు చేసే వివరాలు కరెక్ట్‌గా ఉన్నాయాలేదా పరిశీలించారు. కేంద్రంలో గల సరుకులను తనిఖీచేసి రికార్డులుపరిశీలించారు. ఈ పరిశీలనలో మల్ద కల్ ప్రాజెక్టు సిడిపిఓ కమలాదేవి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు నాగరాణి, యామిని పాల్గొన్నారు.

### గట్టుకాడిపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి

## రూ.2.50 కోట్ల నిధులు మంజూరు

**వనపర్తి, జూన్28, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా జల్లాఘణపురం మండల పరిధిలోని గట్టుకాడిపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ.2.50 కోట్లు మంజూరు అయినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పెబ్బేరు మండలంలోని బున్యాదిపురం గ్రామంలో రహదారుల నిర్మాణానికి రూ.83.90 లక్షలు, వనపర్తి టౌన్ హాల్ నిర్మాణానికి అదనంగా రూ.75 లక్షలు, జిల్లా కేంద్రంలో డ్రెయిన్లు, సీసీ రహదారుల నిర్మాణానికి రూ.1.90 కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఇప్పటికే ప్రత్యేక శ్రద్ధతో గట్టుకాడిపల్లి ఆలయ సుందరీకరణ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. అదే విధంగా గంజిలో నిర్మిస్తున్న టౌన్ హాల్ నిర్మాణంతో జిల్లా కేంద్రానికి ప్రత్యేక శోభ రానున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ సంస్థ కార్యకలాపాలకు ఫంక్షన్ హాల్స్ మీద ఆధారపడుతున్న పరిస్థితి ఉందన్నారు. టౌన్ నిర్మాణంతో ఈ ఇబ్బందులు తొలగనున్నాయన్నారు. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు నిధుల విడుదల మంజూరు చేశారని, నిధులు మంజూరు చేసినందుకు సీఎం కేసీ ఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## మహాబలేశ్వర్‌స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

**గద్వాలప్రతినిధి, జూన్28 ప్రభాతవార్త:** మహారాష్ట్ర, కృష్ణానది జన్మస్థానమైన మహాబలేశ్వరంలోని మహాబలేశ్వర స్వామి దేవాలయంలో నందు స్వామి వారిని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. భారతదేశ తెలంగాణ రాష్ట్రం గద్వాల నియోజకవర్గం సీఎం కెసిఆర్ పాలనలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతూ అన్నివర్గాలప్రజలుకెసిఆర్ నాయకత్వంలో ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్ల సంతోషంగా జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ శ్రీధర్‌గౌడ్, ఎంపిపి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



# నత్తకు మేనత్త...

- కొనసా...గుతున్న మన ఊరు మన బడి పనులు
- గడువు ముగిసిన 70శాతం పనులే పూర్తి



మద్దిగట్ల మోజర్ల జిల్లా పరిషత్ పాఠశాల

**పెద్దమందడి, జూన్28, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మన ఊరు మన బడి పనులు నత్తకు మేనత్తగా ఒక అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కి అన్న చందంగా పనులు కొనసాగుతున్నాయి. గత వారం రోజుల క్రితం మండలంలోని వివిధ పాఠశాలల్లో మన ఊరు మన బడి పథకంలో భాగంగా చేపట్టిన పనులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రారంభించగా మండలంలోని మరికొన్ని పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా ఉండడంతో విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ పనులు నత్తనడకన సాగుతుండడంపై విద్యార్థులకు సరైన సౌకర్యాలు , వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వెల్టూరు, మద్దిగట్ల జిల్లా పరిషత్ పాఠశాలల్లో కొనసాగుతున్న పనులు స్లోగా కొనసాగుతున్నాయి. వెల్టూరులో రూ.46 లక్షలతో చేపట్టిన ఈ పనులల్లో వేగం లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. మద్దిగట్ల జిల్లా పరిషత్ పాఠశాలలో మేజర్, మైనర్, డైనింగ్ హాల్, డ్రింకింగ్ వాటర్ , ఎలక్ట్రిసిటీ సంబంధించిన పనులను చేసేం దుకు ప్రభుత్వం రూ.36 లక్షలు మంజూరు చేసినప్పటికీ ఈ పనులను కొద్ది వరకు పూర్తి చేసినప్పటికీ తరగతి గదుల్లో ఫ్లోరింగ్ వర్క్స్, ఎలక్ట్రిసిటీ పనులు పెండింగ్‌లోఉండడం వల్ల విద్యార్థులు నేలపై కూర్చొని చదువుకుంటున్నారు. మండలంలో మొత్తం 15 పాఠశాలలను మొదటి విడత మన ఊరు మన బడి కార్యక్రమంలో ఎంపిక చేయడం జరిగిందని, రూ.3కోట్ల 30లక్షల నిధులు మంజూరు చేసినప్పటికీ ఇప్పటికీ 70 శాతం పనులు పూర్తి చేసినట్లు ఏఈ కవీందర్ రెడ్డి తెలిపారు. ఇందుకు గానురూ.1కోటి 80 లక్షల నిధులను కాంట్రాక్టర్లకు చెల్లించడం జరిగిందని ఏఈ తెలిపారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెస్తున్నామని జూలై చివరి నాటికల్లా పనులను 100శాతం పూర్తి చేస్తామని ఏఈ తెలిపారు

**- పనులను త్వరలోనే పూర్తి చేస్తాం : విట్ట శ్రీనివాస్‌రెడ్డి, కాంట్రాక్టర్**

వెల్టూరు, మద్దిగట్ల మోజర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో మన ఊరు మన బడి పనులు కొద్దిగా ఆలస్యం అయ్యాయని విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులను వేగవంతం చేశామని మద్దిగట్ల మోజర్ల పాఠశాలలో వారం రోజులలో పనులను పూర్తి చేసి పాఠశాలకు అప్పగిస్తామని, వెల్టూరులో జూలై చివరి నాటికల్లా పనులను పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ తరపున మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు విట్ట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.



అసంపూర్తిగా ఉన్న మద్దిగట్ల పాఠశాల గది



నేలపై కూర్చున్న పాఠశాల విద్యార్థులు

### తెలంగాణకు ముందు.. తర్వాత

# వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

- రాష్ట్ర పర్యాటక, ఆబ్కారి శాఖమంత్రి శ్రీనివాస్‌గౌడ్
- జనరల్ ఆసుపత్రిలో ఫాకో మిషన్ ప్రారంభించిన మంత్రి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 28 ప్రభాతవార్త:** వైద్య రంగంలో అభివృద్ధిని పోల్చాలంటే తెలంగాణకు ముందు తర్వాత అని నిర్వచించాల్సి వస్తుందని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కంటి శుక్లాల తొలగింపు శస్త్ర చికిత్స కోసం రూ. 20 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఫాకో మిషన్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు కేవలం 18 మంది వైద్యులు ఉంటే ఇప్పుడు 220 మంది, ఒక్క ఫార్మాసిస్టు ఉంటే ఇప్పుడు 40 మంది, ఇద్దరు ల్యాబ్ టెక్నిషియన్లు ఉంటే 38 మంది రోగులకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. అధునాతన ఫాకో మిషన్ ఏర్పాటు వల్ల ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఉచితంగా కాటరాక్ట్ సర్జరీలు చేసేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. నిత్యం వేలాది మంది రోగులకు అద్భుమైన సేవలు అందిస్తున్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనితీరుపై సక్సెస్‌కథనాలను అందించాలని మంత్రి మీడియాను కోరారు.

**ఎస్పీ కార్యాలయానికి స్థల పరిశీలన:** మహబూబ్‌నగర్ పట్టణాన్ని నలువైపులా సమాంతరంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఒకవైపు ప్రభుత్వ మెడికల్ కళాశాల, మరోవైపు కెసిఆర్ అర్బన్ ఎకోపార్కు ఐటి కారిడార్, బైపాస్ రహదారి, సమీకృత జిల్లా అధికారుల కార్యాలయం, మరోవైపు వీరన్నపేట డబుల్ బెడ్‌రూం ఇండ్లు, బండమీదిపల్లె పరిసర ప్రాంతంలో జిల్లాకోర్టువంటి వాటికి ఇదివరకే చర్యలు చేపట్టడం జరిగిందని, అంతకాక నూతనంగా సుమారు 30 ఎకరాల స్థలంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయాన్ని నిర్మించేందుకు పాలిలెక్నిక్ కళాశాల వెనుక వైపు, వీరన్నపేట గుట్టల వెనుక వైపు ప్రాంతాన్ని ప్రతిపాదించనున్నట్లు ఆయన తెలిపారు. నూతన ఎస్పీ కార్యాలయం నిర్మాణానికిగాను బుధవారం ఆయనజిల్లా కలెక్టర్ జి.రవినాయక్, జిల్లా ఎస్పీ కె. నరసింహలతో కలిసి ప్రభుత్వ పాలిటెక్నిక్ వెనకవైపు ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. నూతన ఎస్పీ కార్యాలయాన్ని ఇక్కడ నిర్మించడం వల్ల ఎస్పీ కార్యాలయంతో పాటు, పోలీస్ క్వార్టర్స్, పరేడ్ గ్రౌండ్లతో పాటు, అధునాతన సౌకర్యాలు ఎస్పీ ఆఫీసుకు సమకూరుతాయని, ప్రస్తుతం ఉన్న ఎస్పీకార్యాలయంలో డిఐజి కార్యకలాపాలు అక్కడి నుండే కొనసాగించడం జరుగుతుందని ఆయన వెల్లడించారు. నూతన ఎస్పీ కార్యాలయం ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతంలో భూముల ధరలు పెరగడమే కాకుండా, అందరికి ఉపయోగకరంగా ఉంటుందని, ముఖ్యంగా ఎస్పీ కార్యాలయ ప్రతిపాదించిన ప్రాంతంజాతీయ రహదారికి దగ్గరంగా ఉండడం, అన్ని ప్రాంతాలకు అనుసంధానం ఉండడం వల్ల మహబూబ్‌నగర్ నలువైపుల రింగురోడ్డు ఏర్పాటుచేసి అభివృద్ధి చేయవచ్చని, దుబాయ్, సింగపూర్, హైదరాబాద్ వంటి తదితర ప్రాంతాలలో రింగ్‌రోడ్ల ద్వారా అభివృద్ధి చేసుకుంటున్నారని, అదే తరహాలో మహబూబ్‌నగర్‌ను అభివృద్ధి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ కెసి నర్సింహులు, మెడికల్ కళాశాల డైరెక్టర్ డా. రమేష్, జిజిహెచ్ ఇంచార్జి సూపరింటెండెంట్ డా. జీవన్, డా. భాస్కర్, జిజిహెచ్ అడ్వైజర్లు లక్ష్మి, సత్యంయాదవ్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, కౌన్సిలర్లు, వైద్యులు సిబ్బంది ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న దృశ్యం

# డిజిటల్ లావాదేవీల బాధ్యత బ్యాంకర్లదే

**- స్వయం ఉపాధి రుణాలు అవకాశాలపై అవగాహన కల్పించాలి : వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**వనపర్తి, జూన్28, ప్రభాతవార్త:** ప్రతి వ్యక్తి, ప్రతి వ్యాపార లావాదేవీలు బ్యాంకుతో అనుసంధానం అయి డిజిటల్ లావాదేవీలు జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉంది. యువత , మహిళలకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న స్వయం ఉపాధి రుణాలు అవకాశాలపై అవగాహన కల్పించి సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు, మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు అనేక రకాల అభివృద్ధి సంక్షేమ పథకాలు అందిస్తుందని, వాటికి రుణాలు అందించి ఉపాధి పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ బ్యాంకర్లను సూచించారు. బుధవారం ఉదయం వనపర్తి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమన్వయ, సంప్రదింపుల సమావేశం ఏర్పాటు చేసి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి జిల్లా పరిషత్ ఛైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గత సంవత్సరానికి సంబంధించి మార్చి, 2023 నాలుగవ త్రైమాసికంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు సాధించిన ఫలితాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ మాట్లాడుతూ... వనపర్తి జిల్లాలో సారవంతమైన పొలాలు, పుష్కలమైన సాగునీరు ఉందని, గత కొన్ని సంవత్సరాలుగా పంట దిగుబడి సైతం బాగున్నందున రైతులకు ఉదారంగా రుణాలు ఇచ్చి మరింత ప్రోత్సహించాలని బ్యాంకర్లను సూచించారు. ఆధునిక పనిముట్లు, వాణిజ్య పంటల సాగుకు ప్రోత్సహించే విధంగా, ఇప్పటి వరకు బ్యాంకు రుణాలు తీసుకున్న రైతుల నుండి తిరిగి చెల్లింపులు సజావుగా జరిగే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించాలన్నారు. చిన్న పాటి రుణాలు సైతం సకాలంలో తిరిగి చెల్లించని పక్షంలో వారి సిబిల్ స్కోర్ పడిపోయి పెద్ద రుణాలుకోల్పోయే ప్రమాదం ఉంటుంది. రైతు వేదికలను వాడుకోవాలని, ప్రతి మంగళ, బుధవారాల్లో రైతువేదికల్లో జరిగే సమావేశాల్లో బ్యాంకర్లు, గ్రామీణాభివృద్ధి శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొని అవగాహన కల్పించాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతులకు ఇచ్చే సబ్సిడీ రుణాలు పెండింగ్ లేకుండా సత్వరమే మంజూరు చేయాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని బ్యాంకర్లను ఆదేశించారు. జిల్లాలో మొండి బకాయిలు 4.63 శాతం ఉందని, దీనిని తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జడ్పీ ఛైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ... జిల్లాలో బ్యాంకులు తమ లక్ష్యాలు బాగానే సాధిస్తున్నాయికానీ జిల్లా ప్రజలు ఇంకా ఆశించిన స్థాయిలో లబ్ధిపొందలేకపోతున్నారని అన్నారు. బ్యాంకర్లు తమకు నిబంధనలు ఉన్నప్పటికీ కాస్త ధైర్యంచేసి నూతన లబ్ధిదారులను ప్రోత్సహించి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. లావాదేవీలు పెంచుకోవడం ద్వారానే బ్యాంకులు లాభాలు అర్జిస్తాయని , అదే విధంగా మేనేజర్లు మంచి పేరు తెచ్చుకుంటారని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్‌బిఐ ఎల్.డివో వైభవ్ వ్యాస్, నాబార్డ్ డీడీఎం షణ్ముఖచారి, లీడ్ బ్యాంకు మేనేజర్ అమోల్ పవార్, డిక్కీ కోఆర్డినేటర్ సోమశేఖర్, ఎస్‌బిఐ కంట్రోలర్ వెంకటేశ్వర్లు, యూనియన్ బ్యాంకు నుండి శ్రీనివాస్ , జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

# మోజర్ల ఉద్యాన కళాశాలలో ఘనంగా కళాశాల వార్షికోత్సవం

**పెద్దమందడి, జూన్28, ప్రభాతవార్త:** మోజర్ల ఉద్యాన కళాశాలలో బుధవారం కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ రచయిత వ్యక్తిగత వికాస నిపుణులు, డాక్టర్ వంగిపురపు రవికుమార్ మాట్లాడుతూ... విద్యార్థులు మానసిక ఉల్లాసం, మానసిక ప్రశాంతతయే ప్రధాన ధ్యేయంగా చదువులో ముందుండాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీ విద్యార్థి వ్యవహారాల ఆఫీసర్ డాక్టర్ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ.. మోజర్ల ఉద్యాన కళాశాల విద్యార్థులు రాష్ట్రంలో , దేశంలో ఎన్నో కీలకమైన విద్యాసంస్థలలో ఉన్నత చదువులు చదువుతున్నారని, గొప్ప గొప్ప సంస్థలలో ఉద్యోగం పొందారని ఇది చాలా అభినందనీయమైన విషయమని తెలిపారు. వ్యవసాయ జీడీపీలో ఉద్యాన పంటల జీడీపీ 25 శాతం ఉందని ఉద్యాన కళాశాల విద్యార్థులు వృత్తి నైపుణ్యాలను వృద్ధి చేసుకోవాలని భవిష్యత్ అంతా ఉద్యాన పంటలదేనని చెప్పారు. నాణ్యమైన విద్య అందించడమే ఉద్యాన యూనివర్సిటీ ధ్యేయమని వార్షిక కళాశాల పురోగతిని వివరిస్తూ డాక్టర్ పిడియం సైదయ్య, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ మాట్లాడారు. ఉద్యాన విద్యకు ఎంతో భవిష్యత్ ఉందని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి సురేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో 320 మంది విద్యార్థులు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంతమైన వాతావరణంలో బక్రీద్ పండుగ జరుపుకోవాలి : జిల్లా ఎస్పీ



జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి

**వనపర్తి క్రైమ్, జూన్28, ప్రభాతవార్త:** నేడు బక్రీద్ పండుగను ముస్లీం సోద రులు ప్రశాంతమైన వాతావరణంలోస్నేహపూర్వకంగా సోదరభావంతో మెలిగి, అందరూ వారి వారి కుటుంబ సభ్యులతో నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి అన్నారు. బక్రీదు పండుగ సందర్భంగా జిల్లాఎస్పీ జిల్లా ప్రజలందరికీ బక్రీదు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా మాజీ మంత్రి చిన్నారెడ్డి జన్మదినోత్సవం



**పెబ్బేరు, జూన్28, ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి జన్మదిన వేడుకలను వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం తోమాల పల్లిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయ కులు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి చిన్నారెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాంతానికి ఎనలేని సేవలు చేశారని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడురాజేంద్రప్రసాద్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయవర్ధన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సాగర్, పట్టణ అధ్యక్షులు వెంకట్రాములు, మాలపల్లి మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, ఎంపీటీసీ మన్యం, బుర్రమోని రాములు యాదవ్, రాజ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పోలీస్ భరోసా సొసైటీ ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్ చిల్డ్రన్ సెంటర్‌లో కాంట్రాక్టు బేస్ నియామకాలకు దరఖాస్తులు

**గద్వాల ప్రతినిధి, జూన్ 28 ప్రభాతవార్త :** రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ పర్యవేక్షణలో నడిచే భరోసా సొసైటీ ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్ చిల్డ్రన్‌ను జిల్లాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నడుపబడుతున్నది. అందులో కాంట్రాక్ట్ బేస్ కింద వివిధ పోస్టులలోపని చేసేందుకు జిల్లాలో అర్హత గల మహిళలు జులై 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్పీ కె.సృజన తెలిపారు. కాంట్రాక్టు బేస్ కింద ఒక సంవత్సరం పాటు ఈ పోస్టులకు నియమించబడి తదనంతరం సంవత్సరానికి ఒకసారి వారి నియామకాన్ని పొడిగించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. పోస్టులు,

**విద్యా, అర్హతలు:** ఎంఎస్‌డబ్ల్యుతో 2 సంవత్సరాలు (రెమ్యునరేషన్ 18 వేలు) ,2. లీగల్ సపోర్టు ఆఫీసర్, అర్హతలు2 సంవత్సరాలఅనుభవంతో ఎల్‌ఎల్‌బి/ ఎల్‌ఎల్‌ఎం, వయస్సు 35నుండి 45 సంవత్సరాలు (రెమ్యునరేషన్ 22 వేలు)ఉంటుందని పైన చూపిన పోస్టులకు పై విద్యార్హతలు ఉన్న మహిళలు జులై 10వతేదీలోగా బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్ కాపీలతో, జిల్లా పోలీసు కార్యాలయంలోదరఖాస్తు చేసుకోవాలని ఇతర వివరాలకు మొబైల్ 90140 2175కి కాల్‌చేసి వివరాలు తెలుసుకోవాలని జిల్లా ఎస్పీ తెలిపారు. దరఖాస్తు ఫారాలను అందజేయాల్సినచిరునామా జిల్లా పోలీస్ కార్యాలయంలోని జూనియర్‌అసిస్టెంట్ సెల్ నం.9502606025కు అందజేయాలని తెలిపారు.

## రవి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజత

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 28 ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గం ఉట్కూరన మండలం జక్లేరు గ్రామంలో యూట్యూబ్ ఛానల్‌లో విత్రి రవి అనారోగ్యం కారణంగా ఆకస్మికంగా మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న తెలంగాణ ముదిరాజ్ మహాసభ పెద్ద విజయ్‌కుమార్ పార్థీవ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతి చెందిన రవి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవి తనకు చాలా మంచి శ్రేయోభిలాషి అన్నారు. అనంతరం టేకులపల్లి కావలి ఎల్లప్ప మృతి చెందారని తెలుసుకుని వారి పార్థీవ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవి జక్లేర్ గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా తనవంతు సాయం చేసి మన్ననలు పొందిన వ్యక్తి రవి ఆత్మకుశాంతి చేకూరాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ జర్నలిస్టు మహబూబ్‌నగర్ అధ్యక్షులు విలేఖరి ఆశన్న ముదిరాజ్, యాదగిరి ముదిరాజ్, శ్యాంముదిరాజ్, లక్ష్మినారాయణ ముదిరాజ్, టేకులపల్లి నరసింహ ముదిరాజ్, నర్సింలు ముదిరాజ్, జిన్నారంఆంజనేయులు ముదిరాజ్, రామచంద్ర ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

## ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పోటీలు

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 28 ప్రభాతవార్త:** ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణ మూర్తి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి విలియం ఆదేశాల మేరకు జూన్ 30 అంతర్జాతీయ, జాతీయ ఖోఖో దినోత్సవాన్ని పురస్కరించుకుని, మక్తల్ మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠాల కర్ని గ్రామంలో ఈనెల 30న శుక్రవారం నారాయణపేట జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బాలికలకు ఖోఖో పోటీలు నిర్వహించి, గెలుపొందిన ప్రథమస్థానం పొందిన జట్టుకు నగదు బహుమతి పొంది రూ. 5 వేలు, ద్వితీయ స్థానం గెలుపొందిన వారికి రూ. 3 వేలతో పాటు మెమెంటో లను అందజేస్తామని తెలిపారు. జిల్లాలోని ఆసక్తి గల పాఠశాలల బాలికల జట్లు ఈనెల30న ఉదయం 9గం.లకు కర్ని పాఠశాలలో రిపోర్టు చేయాలని కోరారు. మధ్యాహ్నభోజన వసతి ఉంటుందన్నారు. పోటీలలో పాల్గొనే జట్ల వివరాలను ఈ నెల 29 సాయంత్రం 5 గం.లలోపు ఈ క్రింది నంబర్‌లుపిఇటి జడ్పీహెచ్ఎస్ కామి సెల్‌నం. 9121472479 లను సంప్రదించాలని తెలిపారు.

## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌ధరలు

**దేవరకద్ర, జూన్ 28 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుధవారం 30 కింటాళ్ళ ఉల్లిని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. అయితే కింటాల్ ఉల్లికి అత్యధికంగా రూ.1460 ధర పలికింది. అలాగే అతి తక్కువగా కూడ రూ.860 ధర పలికినట్లు మార్కెట్‌అధికారులు తెలిపారు.

## ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండగ జరుపుకోవాలి

**ఇటిక్యాల, జూన్ 28 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఇటిక్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ముస్లిం పెద్దలు బక్రీద్ పండగ వేడుకలను ప్రశాంత వాతావరణంలో సోదర భావంతో జరుపుకోవాలని ఇటిక్యాల ఎస్సై గోకారి సూచించారు. బుధవారం ముస్లిం మతపెద్దలతో సమావేశాన్ని నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఎస్సై గోకారి మాట్లాడుతూ బక్రీద్ పండగను భక్తి శ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఇదే సందర్భంలో ప్రశాంత తకు భంగం కలగకుండా పండగ జరుపుకోవాలని మత పెద్దలను కోరారు. గోవధ నిషేధంకారణంగా మండలంలో ఎక్కడకూడా గోవులనువధించడం చేయరాదని అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలి పారు. మత పెద్దలతో కమిటిని ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో పండగ జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన కోళ్లవెంకటేష్ ముదిరాజ్

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 28 ప్రభాతవార్త:** జిల్లా ధర్మసమాజ్ పార్టీ జిల్లా కమిటి తరపున జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన కోళ్ల వెంకటేష్ ముదిరాజ్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా కమిటి నాయకులు పొర్ల డేవిడ్ మహరాజ్, జుట్ల ఓబ్లేష్ మహరాజ్‌లు మాట్లాడుతూ జిల్లా మత్స్య కార్మికుల హక్కులకై వివిధ సమస్యల నిమిత్తం ఎల్లవేళలా ధర్మ సమాజ్‌పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు ఈశ్వర్, నరసింహులు, ఎస్సై, రిటైర్డ్ గోలపల్లి సూర్యప్రకాష్, శివరాజ్, కృష్ణ, అనిల్, వీరేష్, రిపోర్టర్ హరి, అంజి ముదిరాజ్, శివరాజ్, ఉట్కూర్ మండల నాయకులు కృష్ణ ముదిరాజ్, అనిల్, వీరేష్ పాల్గొన్నారు.

